PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 84 | విజయవాడ, బుధవారం 25 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 25 October 2023 | Rs

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

- 24 గంటల్లో 700 మంది పైగా పౌరుల మృతి
- 400కి పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు

లోపలి పేజీలో..

దిగ్గజ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ కన్నుమూత



చండీగఢ్: దిగ్గజ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ(77) సోమవారం కన్నుమూశారు. అనారోగ్య కారణాలవల్ల మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండేళ్ల క్రితం గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బేడీ.. ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొన్నారు. ఆయనకు భార్య అంజు, కుమారుడు అంగద్, కుమార్తె నేహ ఉన్నారు. 1946 సెప్టెంబర్ 25న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించిన బేడీ ఎడమచేతివాటం స్లో స్పిన్నర్. 1966లో భారతజట్టులో చోటు దక్కించుకున్న బేడీ.. 1976-78 మధ్య కెప్టెన్‌గానూ వ్యవహరించారు. 67 టెస్టుల్లో 28.71 సగటుతో 266 వికెట్లు పడగొట్టాడు. 1979లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బేడీ.. వ్యాఖ్యాతగా, కోచ్‌గా కొనసాగారు. 1970లో పద్మశ్రీ, 2004లో సికె నాయుడు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.



దాడికి గురైన బాలికను మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించి రూ.50 వేల తక్షణ నష్టపరిహారం అందిస్తున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

గిరిజన బాలిక పట్ల అమానుషం

- ఇంట్లో పని ఉందని తీసుకెళ్లి దొంగతనం నేరం మోపి దాడి
- మరో ఇద్దరు మహిళల పట్ల వైసిపి కార్యకర్త పైశాచికత్వం
- ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు, నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- మోపిదేవి, కలెక్టరేట్ (కృష్ణా)

గిరిజన బాలికను ఇంట్లో పని ఉందని పిలిచి దొంగతనం అంటగట్టి పశువును బాదినట్లు బాదాడు. ఆ బాలిక బంధువులైన ఇద్దరి మహిళలపైనా అమానుషంగా ప్రవర్తించాడు ఓ వైసిపి కార్యకర్త. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామంలో ఆలస్యంగా సోమవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రెండు రోజులు బందీలుగానే ఉండి ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని కాలం వెళ్లదీసిన బాధితుల కథనం ప్రకారం... కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త మత్తి రాజాచంద్ తన ఇంట్లో వేడుక ఉందని, కొద్ది రోజులు ఇంటి పని చేయాలని చెప్పి అదే గ్రామానికి చెందిన యానాది సామాజిక తరగతికి చెందిన బాలికను తీసుకెళ్లాడు. అయితే, ఇంట్లో బంగారు చెవి దిద్దులు పోయినట్లు దొంగతనం నెపం మోపి ఆ బాలికను దారుణంగా కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. తలకు కూడా తీవ్ర గాయమై రక్తం ఒళ్లంతా కారింది. ఆ బాలిక పిన్ని పద్మ, అమ్మమ్మ రమణలను కూడా పిలిపించి రాజాచంద్ కొట్టాడు. పోలీసు కేసు కాకుండా తప్పించుకోవడానికి... దొంగతనం చేసిన బంగారు ఆభరణాలు తమకు ఇచ్చినట్లుగా బలవంతంగా వారితో నేరాన్ని ఒప్పించి మోపిదేవి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. ఎటువంటి విచారణా చేయకుండానే రాజాచంద్ చెప్పింది విని ఎస్ఐ పద్మ వారి ముగ్గురినీ స్టేషన్లో తీవ్రంగా కొట్టారు. బాలిక తల నుంచి రక్తం కారుతున్నా పోలీసులుగానీ, రాజాచంద్‌గానీ కనీసం చికిత్స చేయించకుండా క్రూరంగా వ్యవహరించారు. ఆస్పత్రికి వెళితే ఇళ్లు తగలబెడతామంటూ రాజాచంద్ బెదిరించాడు. దిక్కుతోచని పరిస్థితిల్లో గాయాల నొప్పులు భరించలేక బాధితులు అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. 'వైద్యం మాత్రమే చేయండి... కేసు పెడితే మా దొర చంపేస్తారు' అంటూ ఆస్పత్రి బయటే ఉండి వేడుకున్నారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ వారిని పరామర్శించి ఆస్పత్రిలో చేర్పించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదుకు అవసరమైన ఎంఎల్‌సి రిపోర్టును ఆస్పత్రి వైద్యుల ద్వారా ఇప్పించారు. ఈ నేపథ్యంలో అవనిగడ్డ డిఎస్‌పి మిగతా 2లో

సిఐ, ముగ్గురు ఎస్ఐల సస్పెన్షన్

- ఓట్ల అక్రమ తొలగింపులో బిఎల్‌ఓలపై ఒత్తిడే కారణం

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధం గా బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఫారం-7 దరఖాస్తుల సమాచారాన్ని తీసుకోవడమే కాకుండా బిఎల్‌ఓలపై ఓట్ల తొలగింపు కోసం ఒత్తిడి చేయడంతో మార్టూరు సిఐ టి.ఫిరోజ్, పర్చూరు ఎస్ఐ ఎన్‌సి.ప్రసాద్, మార్టూరు ఎస్ఐ కె.కమలాకర్, అప్పటి యద్దనపూడి ఎస్ఐ కె.అనూక్ సస్పెన్షన్‌కు గురయ్యారు. గుంటూరు రేంజ్ ఐజి పాలరాజు ఆదేశాలతో బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరులో దొంగ ఓట్లను తొలగించాలని కోరుతూ వైసిపి అనుయా యులు కొందరు ఫారం-7 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ప్రతిపక్షాల ఓట్లు తొలగించేందుకు వైసిపి కుట్ర చేస్తోందని, పర్చూరు నియోజకవర్గంలో 189 మంది 14 వేల ఓట్ల తొలగింపునకు అక్రమ మార్గంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశారని స్థానిక టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బిఎల్‌ఓలుగా నియమితులైన మహిళా పోలీసులతో పోలీసు అధికారులు మార్టూరు, యద్దనపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారని, ఫారం 7 ద్వారా దాఖలైన దరఖాస్తుల విషయంలో నేరుగా జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ వాట్సాప్ చాట్‌ల స్క్రీన్ షాట్లను ఎన్నికల కమిషన్‌కు పంపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా విచారణ చేయించారు. మార్టూరు సిఐ, ముగ్గురు ఎస్ఐలకు బిఎల్‌ఓలు ఫారం-7ల సమాచారం పంపినట్లు తేలడంతో ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. దీంతో, వారి నలుగురినీ సస్పెండ్ చేస్తూ ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు.

350 ఎకరాలు స్వాహా!

అదాని - వేదాంత రహస్య ఒప్పందం

- జింక్ భూమి అప్పగింతకు కేంద్రం అంగీకారం
- ఒసిసిఆర్‌పి నివేదికలో వెల్లడి



జింక్ వేదాంత భూములు (ఇన్‌సెట్)లో హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ ముఖద్వారం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని తీర ప్రాంత భూములపై కన్నేసిన అదాని సంస్థ మరింతగా తెగబడుతోంది. విశాఖపట్నంలోని జింక్ పరిశ్రమకు చెందిన వేలాది కోట్ల రూపాయల విలువైన భూములను ఆ సంస్థ దక్కించుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు జింక్ పరిశ్రమలో కీలక భాగస్వామిగా ఉన్న వేదాంత సంస్థతో ఆ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందం తాజాగా బట్టబయలైంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒకప్పుడు ప్రభుత్వ రంగలో జింక్ పరిశ్రమ ఏర్పాటు కోసం స్థానిక రైతులు నామమాత్రపు ధరకు ఈ ప్రాంతంలో భూములు ఇచ్చారు. తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశించారు. కానీ, ఉపాధి అవకాశాలు రాకపోగా, కేంద్ర ప్రభుత్వం అనుసరించిన నూతన సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ఆ భూములు వేదాంత సంస్థ పరమైనాయి. ఇప్పుడు అవే భూములను దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థ అదాని చేజిక్కించుకోనున్నట్లు ఒసిసిఆర్‌పి నివేదిక వెల్లడించింది. గుట్టుచప్పుడు కాకుండా జరిగిన ఈ డీల్‌కు నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు.

ఎన్ని ఎకరాలు....?

1974 వ సంవత్సరంలో ప్రభుత్వ రంగంలో హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ ఏర్పాటు కోసం మింది, నక్కవానిపాలెం, చుక్కవానిపాలెం, ములగాడ గ్రామాల ప్రాంతాల రైతుల నుండి ప్రభుత్వం భూమిని సేకరించింది. ఎకరా 850 రూపాయల చొప్పున 350 ఎకరాలను అప్పట్లో రైతులు ఇచ్చారు. 2002లో కేంద్రంలోని వాజ్‌పేయి, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు జింక్ పరిశ్రమను దెబ్బతీసే చర్యలకు ఉపక్రమించాయి. ఆ ఏడాదే ఈ పరిశ్రమలోని అధికశాతం వాటాను వేదాంత సంస్థ దక్కించుకుంది. వేదాంత గ్రూప్‌నకు ప్రస్తుతం జింక్ పరిశ్రమలో 64.92 శాతం స్టేక్ ఉంది. 29.54 శాతం ప్రభుత్వ వాటాగా ఉంది. తాజా ఒప్పందంలో భాగంగా రైతుల నుండి సేకరించిన 350 ఎకరాల భూమి అదాని పరం కానుంది. గాజువాకకు సమీపంలోనే ఉన్న ఈ భూములు ప్రస్తుతం ఎకరాకు 10 కోట్ల రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ఒప్పందంలో భాగంగా అదాని ఎంత రేటు చెల్లించనుందన్న విషయం వెలుగులోకి రాలేదు. వేదాంతకు చెందిన మొత్తం వాటాలను కూడా అదాని చేజిక్కించుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఆ తరువాత కేంద్ర ప్రభుత్వానికి మిగిలి ఉన్న నామమాత్రపు వాటాను దక్కించుకోవడం అదాని గ్రూపునకు కష్టం కాదన్న సంగతి తెలిసిందే. గంగవరం పోర్టులో తనకున్న పదిశాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం అదానికోసం వదులుకున్న సంగతి తెలిసిందే. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఇదే మాదిరి తప్పుకునే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంటే, స్థానిక రైతాంగం భవిష్యత్తుపై గంపెడు ఆశతో ప్రభుత్వానికి ఇచ్చిన భూములు, వారి ఆశలు నెరవేరకపోగా చివరకు కార్పొరేట్ల పరం కానున్నాయి.

విశాఖ వాసులకు మసే...!


ఈ భూములను బొగ్గు స్టాక్ యార్డుగా మార్చే ఆలోచనలో అదాని గ్రూపు ఉన్నట్లు సమాచారం. అదాని గంగవరం పోర్టుకు పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్న బొగ్గును ఇక్కడ నిలువ చేసి, ఆ తరువాత దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే ఆమోద ముద్ర వేసినట్లు చెబుతున్నారు. అదే జరిగితే మింది, నక్కవానిపాలెం, ములగాడ, గాజువాక సహా మర్రిపాలెం, విశాఖ నగరం బొగ్గు మసితోనూ, కాలుష్యంతోనూ నిండిపోనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర సర్కారు మౌనం!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ విషయంలో పెదవివిప్పని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జింక్ భూముల విషయంలోనూ అదే వ్యూహాన్ని పాటిస్తోంది. స్థానికంగా చర్చనీయాంశమైనప్పటికీ ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలతో పాటు, విశాఖ ప్రాంతంలోని అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా మౌనముద్ర వేసింది. ప్రజలు మాత్రం భూములను అదానికి కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

ఆందోళనకరంగా అక్టోబర్

- 89 శాతం తక్కువ వర్షం
- ఖరీఫ్ పంటలు సర్వనాశనం
- తీవ్రరూపం దాల్చిన కరువు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రంలో కరువు తీవ్ర రూపం దాల్చింది. ఖరీఫ్ పంటలకు అక్టోబర్‌లో కురిసే వర్షాలు కీలకం కాగా, సరిగ్గా ఇప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాభావం తిష్టవేసింది. ఈ నెల 1 నుంచి 24 (మంగళవారం) వరకు పడాల్సిన సాధారణ వర్షంలో ఏకంగా 89 శాతం తక్కువ వర్షం నమోదైంది. అన్ని జిల్లాలూ అత్యల్పవర్షం కేటగిరిలో మగ్గుతున్నాయి. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ, ఈశాన్య రుతుపవనాల ఆగమనం తరుణంలో సాధారణంగా వానలు కురుస్తాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో బంగాళాఖాతంలో తుపాన్లు ఏర్పడతాయి. కానీ ఈ మారు చినుకు పడకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. అసలే ఖరీఫ్ సీజన్ మొదటి నుంచీ వర్షాభావం నెలకొంది. దాంతో లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదు. సాగైన పంటలకు రక్షక తడులు ఖర్చుతో కూడుకున్నాయి. ఈ సమయం లోనైనా వానలు పడతాయని, వేసిన పంటలకు ఊపిరి పోస్తాయని ఆశగా ఎదురు చూస్తుండగా, ఇప్పుడు కూడా అన్నదాతలకు నిరాశే ఎదురైంది.

కర్నూలులో 99 శాతం మైనస్

అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు నార్మల్ వర్షం 126.9 మిల్లీమీటర్లకు గాను కేవలం 13.7 మిమీ కురిసింది. ప్రాంతాలవారీగా చూస్తే కోస్తాలో 88 శాతం, రాయలసీమలో 90 శాతం మేర లోటు వర్షపాతం నమోదైంది. కర్నూలులో 99 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలో ఇదే కనిష్ట వర్షపాతం. అంటే ఈ 24 రోజుల్లో కర్నూలు జిల్లాలో అస్సలు చినుకు పడనట్లే లెక్క. ఆ తర్వాత నెల్లూరులో 98 శాతం తక్కువ వర్షం కురిసింది. ఇక్కడ కూడా అదే పరిస్థితి. చిత్తూరులో 66 శాతం తక్కువ వర్షం పడింది. అన్ని జిల్లాల్లోకెల్ల ఉన్నంతలో మెరుగైన జిల్లా ఇదే. వర్షపు లోటు 90 శాతం కంటే ఎక్కువ ఉన్న జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్, గుంటూరు, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి.

440 మండలాల్లో తక్కువ

ఖరీఫ్ మొదటి నుంచీ చూసినట్లయితే జూన్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్య నార్మల్ వర్షం 719.6 మిమీ పడాల్సి ఉండగా 504 మిమీ పడింది. లోటు 29.8 శాతం. ఏకంగా 18 జిల్లాల్లో తక్కువ వర్షం నమోదైంది. కేవలం 8 జిల్లాల్లోనే సాధారణ వర్షం పడింది. రాష్ట్రంలో అర్బన్, రూరల్ కలుపుకొని 669 మండలాలుండగా మంగళవారం సాయంత్రానికి 440 మండలాల్లో మైనస్ వర్షం నమోదైంది. మరీ 32 మండలాల్లో దుర్భిక్షం నెలకొంది. అక్టోబర్‌లో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో ఖరీఫ్ పంటలు ఎండుతున్నాయని, భూగర్భజలాలు లోతుల్లోకి పోతున్నాయని, విద్యుత్ కోతలు పంటలను సర్వనాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



బైజూస్ సిఎఫ్ఒ అజయ్ గోయల్ రాజీనామా

తిరిగి వేదాంత గూటికి..

న్యూఢిల్లీ : ఆర్థిక ఇబ్బందులు, ఎకౌంట్ కష్టాల్లో ఉన్న బైజూస్‌కు అత్యంత కీలకమైన అధికారి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) అజయ్ గోయల్ రాజీనామా చేశారు. కరోనా కాలంలో ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మైనింగ్ దిగ్గజం వేదాంత గ్రూపు నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో వచ్చిన అజయ్ తిరిగి ఆ సంస్థ గూటికే చేరారు. వేదాంతలోనూ సిఎఫ్ఒగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నెల 30 నుంచి అజయ్ విధుల్లో చేరతారని వేదాంత వెల్లడించింది. కంపెనీ పునర్ వ్యవస్థీకరణ ప్రణాళిక కీలక దశలో ఉన్న తరుణంలో ఆయన పునరాగమనం సంస్థ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉందని పేర్కొంది.

భూ కుంభకోణాలపై న్యాయవిచారణ

- వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలుబ్యూరో

ప్రకాశం జిల్లాతోపాటు రాష్ట్రంలో వివిధ చోట్లా జరుగుతున్న భూ కుంభకోణాలలో బాధితులకు న్యాయం చేసేందుకు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో నకిలీ రిజిస్ట్రేషన్లు, నకిలీ స్టాంపులతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆస్తులను కాజేస్తున్నారన్నారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం పట్టణాల్లో ఇలాంటి కుంభకోణాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇవి జరుగుతున్న తీరు చూస్తే, తెల్గీ కుంభకోణంలా ఉందని పేర్కొన్నారు. సామాన్యుల, మధ్యతరగతి ప్రజల, విదేశాల్లో ఉన్న వారి, అద్దెకు ఇళ్లు ఇచ్చిన వారి ఆస్తులకు నకిలీ పత్రాలతో ఎసరు పెడుతున్నారన్నారు. అక్రమ పత్రాలతో ఆస్తులను కొల్లగొడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ఈ సంఘటనలు సంచలనం కలిగిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేలు కూడా అక్రమ రిజిస్ట్రేషన్లను ప్రోత్సహిస్తూ పంచాయితీలు చేస్తున్నారని విమర్శించారు. రైతుల భూములను వివిధ పరిశ్రమల పేరుతో పలువురు తీసుకుని వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకుంటూ వాటిని కూడా అమ్ముకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ పనితీరు ఆందోళనకరంగా మారిందన్నారు. అన్ని రకాల పత్రాలూ సక్రమంగా ఉన్నాయో? లేదో? చూడకుండానే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు. అవి సక్రమంగా లేకుంటే కోర్టులకు వెళ్లాలని సూచించడం కూడా విడ్డూరంగా ఉందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తోన్నా, ఇలాంటి పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు సాగడం ఏమిటని ప్రశ్నించారు. బైజూస్‌కు వేల కోట్ల రూపాయలు ఇచ్చామని చెబుతున్నారని, టోఫెల్ శిక్షణ పేరుతో కేటాయింపులు చేస్తున్నారని, ఇవన్నీ కార్పొరేట్ సంస్థల కోసమేనా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీటితోపాటు మద్యం ఇసుకలో వేల కోట్ల రూపాయలు తరలిపోతున్నా యనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. వాటిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయలు కొందరి జేబుల్లోకిపోతుంటే జనంపై వివిధ పన్నుల రూపంలో భారాలు మోపుతున్నారన్నారు. మద్యం అక్రమాలపై విచారణ జరపాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి కేంద్ర హోం మంత్రిని కలిసి కోరారన్నారు. ఇప్పటికీ విచారణ లేకపోగా, ఆమె కూడా మౌనంగా ఉన్నారని తెలిపారు. అంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారా? లేక రాష్ట్రం చేసే పనులకు కేంద్రం వత్తాసు పలుకుతోందా? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణాల్లో బిజెపి పాత్ర కూడా ఉందన్నారు. వేలాది ఎకరాలు అదానీకి ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అదానీ కలిసినా రహస్యంగా మిగతా 2లో

వైసిపి కార్యకర్త దారుణ హత్య

- టిడిపి వారే ఈ దారుణానికి పాల్పడ్డారు : ఎమ్మెల్యే కాసు
- మాకు సంబంధం లేదు : మాజీ ఎమ్మెల్యే యరపతినేని



మృతుడు కృష్ణారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి- పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా గురజాల మండలంలో సోమవారం రాత్రి వైసిపి కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాయి. ఈ ఘటన రాజకీయరంగు పులుముకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం... పులిపాడు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కూనిరెడ్డి కృష్ణారెడ్డి (30) ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో సంగమేశ్వరం వద్ద ఆయనపై సుమారు ఐదుగురు వ్యక్తులు కళ్లల్లో కారం చల్లారు. అనంతరం వేట కొడవళ్లు, గొడ్డలతో హత్య చేశారు. ఈ దారుణానికి పాల్పడింది ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు. మూడు బృందాలను నియమించి దర్యాప్తు చేస్తున్నట్టు గురజాల డిఎస్‌పి పల్లపు రాజు చెప్పారు. ముఖానికి వస్త్రం కట్టుకుని వచ్చిన దుండగులు మారణాయుధాలతో దాడి చేశారని తెలిపారు. హతుడు శరీరంపై 22 గాయాలు ఉన్నట్టు చెప్పారు. ఈ ఘటనపై గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పందించారు. టిడిపి నాయకుల ప్రమేయంతోనే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. హతుడు కూనిరెడ్డి కుటుంబసభ్యులను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. రాజకీయ కక్షలతోనే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. ఈ హత్యతో టిడిపి వారికి ఎటువంటి సంబంధమూ లేదని, వ్యక్తిగత కారణాలతోనే ఈ హత్య జరిగి ఉంటుందని టిడిపి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో గురజాల మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన పులిపాడులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

నేటి నుంచి 'నిజం గెలవాలి' యాత్ర

- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలో భువనేశ్వరి పర్యటన
- 1 నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ


లోపలి పేజీలో..

26 నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర

- వైసిపి షెడ్యూల్ ఖరారు
- ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల నుంచి ప్రారంభం

తప్పుల తడకగా భూముల రీసర్వే

- సరిచేయకుండానే మూడో విడతకు సిద్ధమైన ప్రభుత్వం
- లబోదిబోమంటున్న యజమానులు



తప్పులు, తడకతో నమోదైన పాస్‌పుస్తకాన్ని చూపిస్తున్న రైతు రెడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

- పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేట రెవెన్యూ పరిధిలో రెడ్డివాని వలస గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడుకు 2.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల చేపట్టిన జగనన్న సమగ్ర భూ సర్వే అనంతరం ఆయన పేరున 70 సెంట్లు మాత్రమే పాస్‌బుక్‌లో నమోదైంది. అదే రెవెన్యూ పరిధిలోని పనుకుపేటకు చెందిన తెర్లి శంకరరావు పేరున కొంత, అంటిపేటకు చెందిన ఆర్నిబిల్లి స్వామినాయుడు పేరున మరికొంత నమోదైపోయింది. శంకరావు ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లో మాత్రం అప్పలనాయుడు పేరు ఉంది. ఆధార్ నంబర్ మాత్రం శంకరరావుదే.
- పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం రెడ్డివానివలసకు చెందిన రెడ్డి సత్య నారాయణకు అదే గ్రామంలో 3.80 ఎకరాల భూమి ఉంది. రీ సర్వే తరువాత కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకంలో 2.20 ఎకరాలు మాత్రమే నమోదు చేశారు. మిగిలిన 80 సెంట్లు లెక్క కనిపించడం లేదు. ఆయనకు సంబంధంలేని సర్వే నెంబరు 127-5లో 13 సెంట్లు కొత్తగా నమోదు చేశారు.
- విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ఆరికతోటకు చెందిన కె.కృష్ణమూర్తి అదే గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 136-9, 136-10, 136-15, 136-16, 136-20లలో 94 సెంట్ల భూమినిసుమారు 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. తాజా సర్వే అనంతరం ప్రభుత్వం జారీ చేసిన పాస్‌పుస్తంలో ఆయా సర్వే నెంబర్లకు బదులు 136-9పి, 138-2పి, 136-1, 136-3 కనిపిస్తున్నాయి.

ఇటువంటివి పార్వతీపురం మన్యం జిల్లాల్లోనే కాదు విజయనగరం జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకున్నట్లు సమాచారం. భూ విస్తీర్ణం తగ్గిపోవడం, ఒకరి భూమి మరొకరికి దఖలు పల్చడంతో సర్వత్రా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

విజయనగరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 983 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో మొదటి విడత 179 గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పేరిట ప్రభుత్వం సమగ్ర భూసర్వే చేపట్టింది. రెండో విడతలో మరో 198 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. తొలి, మలి విడతల్లో జరిగిన తప్పులను సరిచేయకుండానే ప్రస్తుతం మూడో విడతలో 160 గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. తొలి, మలి విడతల్లో సర్వే పూర్తి చేసిన చోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలను యజమానులకు అందజేశామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్టు ఇటీవల జరిగిన కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. ఈ నెల 18న సర్వే పనులను సమీక్షించిన మిగతా 2లో

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్

ప్రజాశక్తి-మోపిదేవి (కృష్ణా జిల్లా)

రాష్ట్రంలో అభివృద్ధి పనులపై వైసిపి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా మోపిదేవిలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కనకమేడల రవీంద్ర దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ఆదాయం ఎటువెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అప్పులు, ఆదాయం, సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేపు లీడ్ బ్యాంకు వద్ద ధర్నా

- కౌలురైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలురైతులకు రుణాలివ్వాలని కోరుతూ.. గురువారం విజయవాడలోని స్టేట్ లీడ్ బ్యాంకు వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలురైతులు సుమారు కోటి ఎకరాల భూమిని సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎనిమిది లక్షల మంది కౌలురైతులకు మాత్రమే పంట సాగుహక్కు పత్రాలు ఇచ్చిందన్నారు. 2023-24 వ్యవసాయ ప్రణాళికలో రూ.80 వేల కోట్లు పంట రుణాలివ్వాలని స్టేట్ బ్యాంకర్స్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఇందులో రూ.నాలుగు వేలకోట్లు రైతులకు ఇస్తామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయ్యేనాటికి కౌలురైతులకు రూ.700 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. పంట స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలురైతులకు 50 శాతం రుణాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఇఫ్లూ లైంగిక వేధింపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- కేంద్ర విద్యాశాఖ మంత్రికి సిపిఎం ఎంపి ఎఎ రహీమ్ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) క్యాంపస్‌లో విద్యార్థినిపై దాడి, లైంగిక వేధింపుల ఘటనపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిపిఎం ఎంపి ఎఎ రహీమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ఆయన లేఖ రాశారు. 'ఈ నెల 18 రాత్రి క్యాంపస్‌లోనే విద్యార్థినిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి అపస్మారక స్థితికి చేర్చారు. ఇంత తీవ్రమైన హింస జరిగినా సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు చెప్పుకోదగ్గ చర్యలు తీసుకోలేదు. అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యార్థినికి న్యాయం జరగాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలి' అని లేఖలో ఎంపి డిమాండ్ చేశారు. అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలని, విద్యార్థినులపై పెరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రహీమ్ అభ్యర్థించారు.

ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలి : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంచనా కోసం ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని, శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడకు వచ్చిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్‌పై ముఖ్యంగా బేవరేజ్ కార్పొరేషన్ వంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తీవ్ర ఆర్థిక మోసాల విచారణ సంస్థ ద్వారా దర్యాప్తు జరిపించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేవలం ఆర్‌బిఐకు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రూ.4.42 లక్షల కోట్ల అప్పులను మాత్రమే చెప్పారని, ప్రభుత్వ కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులను చెప్పలేదని గుర్తుచేశారు. పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన సమాధానంతో రాష్ట్రంలో బిజెపి రాష్ట్రశాఖ ప్రతిష్ట దెబ్బతినేలా వైసిపి ప్రభుత్వం ప్రచారం చేసిందని లేఖలో వివరించారు.

భూ కుంభకోణాలపై న్యాయవిచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఉంచుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని శిథిలావస్థకు చేర్చుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అక్రమ భూ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. తాగునీటికి కేటాయించిన ఐదు టిఎంసిలు చాలేలా లేవని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణులు చేస్తోన్న నిరసనలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక విధానాలను ప్రతిఘటించేందుకు ఐక్యంగా ఉధృత పోరాటాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునకు సంబంధించిన కరపత్రం, పోస్టరును రైతు, కార్మిక సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలు, విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా 2020లో జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటానికి అండగా నిలిచిందనే సాకుతో న్యూస్‌క్లిక్ అనే వెబ్‌సైట్‌పై అక్రమ కేసు పెట్టడం తగదన్నారు. రైతు ఉద్యమానికి, మీడియాకు విదేశీ నిధులు అందుతున్నాయని మోడీ ప్రభుత్వం ఆరోపించడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణం రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే న్యూస్‌క్లిక్ యాజమాన్యంపై, జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తేయాలన్నారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు ఉద్యమం ప్రారంభమై వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాన్ని నిరసిస్తూ నవంబరు 6న విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో 323 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, 30 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకాక బీళ్లుగా మారాయని, వేసిన పంటలు కూడా వర్షాలు లేక ఎండిపోతున్నాయని, డెల్టాలో సైతం నీరు అందని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే సాగునీటిని విడుదల చేసి పంటలు కాపాడటానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు రైతాంగ సమస్యలపై నవంబరు 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనందునే సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. గుండ్లకమ్మ, అన్నమయ్య వంటి ప్రాజెక్టులను తక్షణం పూర్తి చేయలన్నారు. రాయలసీమ వంటి ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించాలని కోరారు. వర్షాభావంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని, పంటల బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరు రంగారావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు ఎం రామకృష్ణ, పిఒడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి బి పద్మ, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి యల్లా మందారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయదశమి రోజున రెండు అలంకారాల్లో 'దుర్గమ్మ'

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ) /శ్రీశైలం

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. విజయదశమి పండుగ రోజున దేవాలయ యాగశాలలో జరిగిన పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విజయదశమినాడు దుర్గమ్మను రెండు అలంకారాల్లో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ మహిషాసుర మర్దినీ దేవిగా, అనంతరం శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. పండుగ సెలవు దినం కావడంతో పలు జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో సందర్శకులు దుర్గమ్మను దర్శించుకున్నారు. విఐపిలు తమ కుటుంబాలతోసహా తరలిరావడంతో దర్శనాలకు సామాన్యులు ఇబ్బందులకు గురయ్యారు. భవానీ మాలధారులు పోటెత్తారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై కృష్ణానదిలో విహరింపజేశారు. ఈ కార్యక్రమాన్ని సందర్శకులు భకి_శ్రద్ధలతో వీక్షించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను దుర్గాఘాట్ నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణల మధ్య నగర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో దేవాదాయ



శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, ఆలయ ఇఒ కెఎస్ రామారావు, ధర్మకర్తల మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

శ్రీశైలంలో ముగిసిన దసరా ఉత్సవాలు

శ్రీశైలంలో జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. నందివాహనంపై స్వామి అమ్మవార్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఈశాన్య భాగంలో ఉన్న పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. పూర్ణాహుతితో పూజా కార్యక్రమాలకు మంగళహారతి పలికి ముగించారు.

27న అసంఘటిత కార్మికుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

అసంఘటిత రంగ కార్మికుల రాష్ట్ర సదస్సును శుక్రవారం నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. ఈ సదస్సుకు కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు హాజరవుతారని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. ఈ సదస్సులో భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, రోడ్డు మార్జిన్ కార్మికులు, ఆటో, మున్సిపల్ కార్మికులు ఇలా అనేక రంగాల వారి సమస్యలపై ప్రధానంగా చర్చ జరుగనుందని తెలిపారు. ప్రధానంగా కార్మికుల వేతనాలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీల సాధన కోసం నిర్వహించాల్సిన పోరాటాలకు సంబంధించిన ప్రణాళికను రూపొందించనున్నారని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటిత రంగ కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. జిడిపిలో 67 శాతం ఆదాయం ఈ కార్మికుల శ్రమ ద్వారా వస్తుందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

26 నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర

- వైసిపి షెడ్యూల్ ఖరారు
- ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల నుంచి ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికలకు వైసిపి ప్రచారాన్ని అనధికారికంగా ప్రారంభించబోతోంది. సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో ఈ మేరకు కార్యాచరణను రూపొందించింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక బహిరంగ సభను నిర్వహించేలా బస్సు యాత్రకు కార్యాచరణను రూపొందించింది. ఈ నెల 26 నుంచి ఒకేరోజు ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్రలు డిసెంబరు నెలాఖరు వరకు జరిగేలా రూపొందించింది. ఇందుకోసం మూడు బస్సులను సిద్ధం చేసింది. బస్సుల ముందు భాగంలో వైసిపి ఎన్నికల గుర్తు ఫ్యాను, పైభాగాన సామాజిక సాధికార యాత్ర పేరు కనపడేలా స్టిక్కరింగ్ చేశారు. మిగతా మూడు వైపులా మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో స్టిక్కర్లు, పార్టీ అధినేత, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఏర్పాటుచేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రముఖుల చిత్రాలను కూడా బస్సు మీద ఏర్పాటు చేశారు. తొలి విడతలో నవంబరు తొమ్మిదో తేదీ వరకు ఈ యాత్రలకు సంబంధించిన వివరాలను వైసిపి విడుదల చేసింది.

ఉత్తరాంధ్రలో తొలుత ఇచ్ఛాపురంలో ఈ నెల 26న బస్సు యాత్ర ప్రారంభం కానుండగా, 27న గజపతినగరం, 28న భీమిలి, 30న పాడేరు, 31న ఆమదాలవలస, నవంబరు 1న పార్వతీపురం, 2న మాడుగుల, 3న నరసన్నపేట, 4న శృంగవరపుకోట, 6న గాజువాక, 7న రాజాం, 8న సాలూరు, 9న అనకాపల్లి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర జరగనుంది.

కోస్తాంధ్రలో ఈ నెల 26న తెనాలిలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర 27న నరసాపురం, 28న చీరాల, 30న దెందులూరు, 31న నందిగామ, నవంబరు 1న కొత్తపేట, 2న అవనిగడ్డ, 3న కాకినాడ రూరల్, 4న గుంటూరు తూర్పు నియోజకవర్గం, 6న రాజమండ్రి రూరల్, 7న వినుకొండ, 8న పాలకొల్లు, 9న పామర్రు నియోజకవర్గాల్లో కొనసాగనుంది.

రాయలసీమలో ఈ నెల 26న సింగనమల నియోజకవర్గంలో బస్సు యాత్ర ప్రారంభమై 27న తిరుపతి, 28న ప్రొద్దుటూరు, 30న ఉదయగిరి, 31న ఆదోని, నవంబరు 1న కనిగిరి, 2న చిత్తూరు, 3న శ్రీకాళహస్తి, 4న ధర్మవరం, 6న మార్కాపురం, 7న ఆళ్లగడ్డ, 8న నెల్లూరు రూరల్, 9న తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించేలా సామాజిక సాధికార బస్సు యాత్రను రూపొందించింది.

మేడిగడ్డ బ్యారేజీకి కేంద్ర బృందం

- ఆరుగురు నిపుణుల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కుంగిన కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్‌ను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. వంతెన కుంగిన ఘటనపై ఆరుగురు నిపుణులతో కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. బ్యారేజ్‌ను పరిశీలించింది. వంతెన కుంగిన ప్రాంతాన్ని, పగుళ్లు ఏర్పడిన ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. 20వ ఫిల్లర్ వద్ద నిచ్చెన సాయంతో కిందకు దిగి దెబ్బతిన్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. శనివారం రాత్రి ఏం జరిగిందన్న విషయాన్ని ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన పూర్తయిన తర్వాత బ్యారేజీ నుంచి కేంద్ర బృందం సభ్యులు వెనుదిరిగారు. ఒకటి.. రెండు రోజుల్లో కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక అందజేయనున్నట్టు సమాచారం. కేంద్ర బృందం వెంట కాళేశ్వరం ఇఎన్‌సి వెంకటేశ్వర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన నేపథ్యంలో నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నీటిమట్టం కనిష్ఠ స్థాయికి చేరింది. బ్యారేజ్ ఎగువ నుంచి 57 గేట్ల ద్వారా 22,500 క్యూసెక్కుల వరదను దిగువకు విడిచిపెట్టారు. ఈ నెల 21న రాత్రి భారీ శబ్దంతో బ్యారేజ్ 20వ పియర్ కుంగిపోయింది. దీంతో బి-బ్లాకులోని 18, 19, 20, 21 ఫిల్లర్ల మధ్య ఉన్న వంతెన ఒక అడుగు మేర కుంగిపోయింది. బ్యారేజీ.. క్రస్టు గేటుకు మధ్య పగుళ్లు వచ్చాయి. గోదావరిపై ఉన్న ఈ బ్యారేజీకి ఒకవైపు మహారాష్ట్ర, రెండోవైపు తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

నేటి నుంచి 'నిజం గెలవాలి' యాత్ర

- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలో భువనేశ్వరి పర్యటన
- 1 నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు వార్త విని మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఈ నెల 25 నుంచి నారా భువనేశ్వరి పరామర్శించనున్నారు. 'నిజం గెలవాలి' పేరుతో చేపట్టనున్న యాత్ర చంద్రగిరి నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్నారు. ఈ యాత్ర వారానికి మూడు రోజుల పాటు ఉండేలా పార్టీ శ్రేణులు రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా ఓ బస్సును తయారుచేశారు. బస్సుపై చంద్రబాబు, ఎన్‌టి రామారావు, భువనేశ్వరి ఫొటోలు ఉండేలా థీమ్‌ను ఏర్పాటుచేశారు. యాత్ర సందర్భంగా స్థానికంగా జరిగే సమావేశాలు, సభల్లో ఆమె పాల్గొననున్నారు. మూడు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటన ఉండనుంది. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం పాకల మండలం, నేంద్రగుంటకు చెందిన కార్యకర్త కె చిన్నబ్బ, చంద్రగిరికి చెందిన ఎ ప్రవీణ్‌రెడ్డి కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించనున్నారు. అనంతరం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ.. అగరాలలో చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నెల 26న తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో నిజం గెలవాలి కార్యక్రమాల్లో పాల్గొంటారు. నవంబరు 1 నుంచి 'బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉండవల్లిలోని నివాసంలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం జోనల్ వారీ పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో జనసేన నేతలు, కార్యకర్తలను కలుపుకుని వెళ్లాలని జోనల్ కో-ఆర్డినేటర్లకు దిశా నిర్దేశం చేశారు. జనసేన-టిడిపికి మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసిపి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పార్టీ నేతలకు లోకేష్ సూచించారు.

'నిజం గెలవాలి' గురించి డిజిపి తెలియదనడం సరికాదు : వర్ల

'నిజం గెలవాలి' యాత్ర గురించి తెలియదని డిజిపి పేర్కొనడం శోచనీయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భువనేశ్వరి యాత్రకు భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 21న డిజిపికి మెయిల్ చేశారన్నారు. సిఎం జగన్ అంటే డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డికి ఎందుకంత భయమో అర్థం కావడం లేదన్నారు. డిజిపికి వచ్చే మెయిల్స్‌ను స్వయంగా ఆయనే చూస్తారా? లేక సజ్జల రామకృష్ణారెడ్డి చూస్తారా? అనే సందేహం కలుగుతోందన్నారు. రోజా మంత్రి అయినప్పటి నుంచి ఆమె ప్రవర్తన వెకిలిగా ఉంటోందని, మాట్లాడే తీరు జుగుప్సాకరంగా ఉంటోందని అన్నారు.

ఓటర్ల లిస్టులో అక్రమాలు - ఎమ్మెల్యే సాంబశివరావు

అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఓటర్ల లిస్టులో వైసిపి అనేక అవకతవకలకు పాల్పడుతోందని టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరైతే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారో, ఎవరైతే ఓటు వైసిపికి వేయబోరని భావిస్తున్నారో అటువంటి వారి ఓట్లను ఓటర్ లిస్టులోంచి తొలగించడానికి వైసిపి కుట్రలు పన్నుతోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వలంటీర్ల వ్యవస్థను వాడుకుంటోందన్నారు. తన నియోజకవర్గమైన పర్చూరులో 14 వేలకు పైగా ఫారమ్-7 పెట్టారని, అదే గ్రామంలో పుట్టినవారి ఓట్లను సైతం తొలగించేందుకు ప్రయత్నించారని అన్నారు. నియోజకవర్గం మొత్తమ్మీద 25 వేల ఓట్లను తొలగించడానికి ప్రణాళికలను వైసిపి సిద్ధం చేసిందన్నారు. ఎన్నికల సంఘానికి పదే పదే చెప్పినా స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. కలెక్టరు, ఎస్‌పి, సిఇఒ, విఆర్‌ఒలందరూ బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 985వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యుఎటిడి, ఆర్‌అండ్‌డి, ఇటిఎల్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కేంద్ర ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఆ దిశగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తి అని, వాటిని అమ్మే హక్కు కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు రామస్వామి, ఎంఆర్.నాగేశ్వరరావు, రామచంద్రరావు, హనుమంతరావు, గుమ్మడి నరేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

700 కి.మీ. తిరిగిన పులి

- ఆశ్చర్యపోతున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఒక పులి 700 కి.మీ మేర ప్రయాణం చేసిన సంఘటన ఇది. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు ఒకటి, రెండు జరిగినట్లు చెబుతున్న అటవీశాఖ అధికారులు ఈ సుదీర్ఘ ప్రయాణాల పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కనిపించిన పులి మహారాష్ట్ర నుండి వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. తెలంగాణలోని అటవీ ప్రాంతం నుంచి రాష్ట్రంలోని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల అటవీ ప్రాంతం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు, అనంతగిరి, కాకినాడ, విజయనగరం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో ఈ పులి తిరిగినట్లు గుర్తించారు. అధికారుల నిర్ధారణ ప్రకారం మహారాష్ట్రలోని బ్రహ్మగిరి అటవీ డివిజన్ ప్రాంతం నుండి ఈ పులి వచ్చింది. అయితే, ఇంత దూరం ప్రయాణం చేయడానికి గల కారణాలను మాత్రం అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని ఖానా అటవీ ప్రాంతం నుంచి ఒక పులి ఏకంగా నల్లమల అటవీ ప్రాంతానికి వచ్చేసింది. ఆ తరువాత ఇదే పులిని ఖానా ప్రాంతంలో గుర్తించారు. అంటే రానుపోనూ దాదాపు రెండు వేల కిలోమీటర్ల దూరం ఈ పులి ప్రయాణించినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఒక పులి తన జీవనం కోసం ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని ఎంపికచేసుకుని, దానిని తన అడ్డాగా మార్చుకుంటుంది. ఆ ప్రాంతంలోకి మరే పులి రాకుండా కూడా చూసుకుంటుందని అటవీ నిపుణులు చెబుతున్నారు. అయితే పై రెండు ఘటనల్లో ఒక పరిధి లేకుండా వందల వేల కిలోమీటర్ల దూరం ప్రయాణాలు చేయడం ఆశ్చర్యకరమని ఒక అధికారి అన్నారు. పులులు కొత్త కారిడార్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా కనపడుతోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలో మాత్రమే పులులు సంచరిస్తుండగా, తాజాగా ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే పరిస్థితులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య

- ఒకరు మృతి, మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన దాడిలో ఒకరు మృతి చెందగా మరొక మహిళ తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. పుల్లడిగుంటకు చెందిన సల్మాకు ఫిరంగిపురం మండలం అమీనాబాద్‌కు చెందిన షేక్ సుభానికి 25 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మద్యం, జూదానికి బానిసైన సుభానీ తరచూ తన భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. వీటిని భరించలేక సల్మా ఎనిమిదేళ్ల క్రితం తన కుమార్తెను తీసుకుని సొంతూరైన పుల్లడిగుంటకు వచ్చారు. ఇటీవల సొంత ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంటికి సెంట్రింగ్ విషయమై సెంట్రింగ్ మేస్త్రీ షాహిదుల్లాతో సల్మా మాట్లాడుతుండగా సుభాని, ఆయన కుమారుడు జైనుల్లావుద్దీన్ ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తులతో ఇరువురిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో షాహిదుల్లా అక్కడికక్కడే మృతి చెందగా, రక్తపుమడుగులో ఉన్న సల్మాను స్థానికులు 108 ద్వారా గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

గిరిజన బాలిక పట్ల అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

మురళీధర్ రంగంలోకి దిగి బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధితులను మచిలీపట్నంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు
రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

గిరిజన బాలికపైనా, గిరిజన మహిళలపైనా దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌తో కలిసి పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రూ.50 వేలు తక్షణ పరిహారంగా మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వు కాపీలను బాధితులకు అందజేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో శంకర నాయక్ మీడియాతో మాట్లాడుతూ గిరిజన మహిళలపై దాడిని ఎస్‌టి కమిషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బాధిత బాలికకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని, మరో ఇద్దరు బాధితులకు స్థిరనివాసం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున పరిహారం కలెక్టర్ ద్వారా అందిస్తామని చెప్పారు. బాధితులకు న్యాయం చేయడంలో అలసత్వం ప్రదర్శించడంతోపాటు వారిపై దాడి చేసిన ఎస్ఐపై, మహిళా కానిస్టేబుల్‌పై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పిని కోరారు.

దాడి అమానుషం : కెవిపిఎస్

మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కెవిపిఎస్ కృష్ణా జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజేష్, ఉపాధ్యక్షులు కొడాలి శర్మ, నగర అధ్యక్షులు ఎం.ఆనంద్ బెనర్జీ, నాయకులు బాబూరావు, ఐద్వా పట్టణ నాయకులు కొడాలి సుజాత, బూరా భవానీ, చీరువోలు విజయలక్ష్మి, పద్మ, సిఐటియు నాయకులు బూరా సుబ్రహ్మణ్యం, చిరువోలు జయరావు పరామర్శించారు. అనంతరం ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌ను కలిసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు : జెసి డాక్టర్ అపరాజిత సింగ్

దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్ తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నిందితులను అరెస్టు చేశామని చెప్పారు.

తప్పుల తడకగా భూముల రీసర్వే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం వచ్చే ఏడాది జనవరిలోపు మూడో విడత సర్వే పూర్తి చేయాలని నిర్ణయించింది. తగినంతగా సాంకేతిక వ్యవస్థ, సిబ్బంది లేకపోవడం, స్వల్పకాల వ్యవధిలో పని పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడం వల్ల జిల్లా అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. దీనికితోడు ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తోన్న సమావేశాలతో మండల సర్వేయర్లు, విఆర్ఒ, విఆర్‌ఒలపై ఒత్తిడి పెరిగిపోతోంది. దీంతో, సర్వే సమయంలో పక్కపక్కన ఉన్న భూముల యజమానులను కూడా సంప్రదించకుండా, అభ్యంతరాలు, సందేహాలు నివృత్తి చేసేందుకు గ్రామంలోనే తహశీల్దార్ ఆధ్వర్యాన మొబైల్ కోర్టులు వంటివి ఏర్పాటు చేయకుండా పనిముగించి హడావుడిగా పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నారు. దీంతో, గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో వెబ్‌ల్యాండ్ నమోదులో జరిగినట్టే ప్రస్తుత రీసర్వేలో కూడా తప్పులు దొర్లుతున్నాయి. ఇందులో వచ్చిన తప్పులను సరిచేయడం అంత సులువు కాదని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు.

పదేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తి పేరుతో పట్టాదారు పాసుపుస్తకం

సర్వే పూర్తయిన పలు గ్రామాల్లో 'ప్రజాశక్తి' పరిశీలించగా అనేక లోపాలు, తప్పుల తడకలు వెలుగులోకి వచ్చాయి. సీతానగరం మండలం అంటిపేట రెవెన్యూ పరిధిలోని రెడ్డివానివలసకు చెందిన రెడ్డి శ్రీదేవి భర్త శ్రీరామ్మూర్తి కోవిడ్ బారిన పడి చనిపోయారు. ఈ నేపథ్యంలో రీసర్వేలో తన పేరున నమోదు చేసి పట్టా ఇవ్వాలని ఆమె దరఖాస్తు చేసుకన్నారు. అయితే, పదేళ్ల క్రితం చనిపోయిన శ్రీదేవి మామ అప్పలనాయుడు పేరున అధికారులు పట్టాదారు పాస్‌బుక్ జారీ చేశారు. తమ గ్రామంలో చేపట్టిన రీసర్వేలో 90 శాతం తప్పులు, తడకలు నమోదయ్యాయని రెడ్డివానివలస రైతులు, రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.

నిజాయితీతోనే గుర్తింపు : హోం మంత్రి

- 'అనంత'లో ప్రొబేషనరీ డిఎస్‌పిల పాసింగ్ అవుట్ పరేడ్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నిజాయితీ, సేవాగుణంతో విధులు నిర్వహిస్తేనే పోలీసులకు గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 28 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిల పాసింగ్ అవుట్ పరేడ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి తానేటి వనిత, డిజిపి కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థలో డిఎస్‌పిల విధులు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. డిఎస్‌పి అంటే డిటెక్టివ్ సెక్షన్ పోలీసింగ్, క్రైమ్ అండ్ సెక్యూరిటీ పోలీసింగ్ పేరు తెచ్చుకోవాలని సూచించారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ పోలీస్ స్టేషన్లు, దిశ యాప్, ప్రత్యేక కోర్టులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. డిజిపి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి అందర్నీ సమన్వయ పరుచుకుని చట్టపరంగా ముందుకు సాగాలన్నారు. న్యాయం కోరి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనపరిచిన ప్రొబేషనరీ డిఎస్‌పిలకు హోంశాఖ మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపల్, ఐజిపి వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ గీతాదేవి, అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎస్‌పిలు కెకెఎన్. అన్బురాజన్, ఎస్‌వి.మాధవరెడ్డి, అనంతపురం ఎంపి తలారి రంగయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'కెజిఎఫ్' నిజమే!

- నెల్లూరు వైసిపి, టిడిపి నేతల ప్రకటన
- పరస్పర ఆరోపణలు
- స్పందించని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా సైదాపురంలో చోటుచేసుకుంటున్న అక్రమమైనింగ్ వ్యవహారంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం కలకలం రేపుతోంది. 'నెల్లూరులో కెజిఎఫ్' శీర్షికతో ప్రచురితమైన కథనంలోని అంశాలను జిల్లాకు చెందిన వైసిపి, టిడిపి నేతలు ధ్రువీకరించారు. విడివిడిగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేల కోట్ల రూపాయల విలువైన తెల్లరాయి అక్రమంగా విదేశాలకు తరలిపోతోందని వీరు ఆరోపించారు. అయితే, అక్రమ మైనింగ్‌కు కారణం మీరంటే మీరని ఆరోపణలు చేసుకున్నారు. ఇంతజరుగుతున్నా అధికారయంత్రాంగం మాత్రం ఈ వ్యవహారంపై పెదవి విప్పడం లేదు. పై స్థాయి నుండి ఒత్తిళ్లు ఉండటమే దీనికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.

కదలని అధికారులు

ప్రజాశక్తిలో వార్తాకథనం ప్రచురితమైన తరువాత అక్రమార్కులు మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. మైనింగ్ నడుపుతోన్న యార్డ్‌లు, ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వీరి ఆఫీసులకు తాళాలు కనపడుతున్నాయి. రవాణా నిలిచిపోయింది. అయితే, అధికారయంత్రాంగంలో నామమాత్రంగా కూడా కదలిక లేదు. యార్డుల్లో అక్రమంగా నిలువ వచ్చిన తెల్లరాయి బాహాటంగా కనిపిస్తున్నప్పటికీ దానిని స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచన కూడా అధికారయంత్రాంగానికి రాకపోవడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ఇక లైసెన్స్‌ల తనిఖీ వంటి సాధారణ కార్యక్రమాలను కూడా అధికారులు చేపట్టలేదు. అటవీ, రెవెన్యూతో పాటు మైనింగ్ శాఖ అధికారులు కూడా కిమ్మనకుండా ఉండటం చర్చనీయాంశంగా మారుతోంది. మరోవైపు వైసిపి, టిడిపి నేతలు అధికారుల పైనే ఆరోపణలు చేశారు. వారి వల్లే అక్రమ మైనింగ్ జరుగుతోందని ఇరు పార్టీల నేతలు విమర్శించినా అధికార యంత్రాంగంలో స్పందన లేకపోవడం గమనార్హం.

మాఫియాలో వైసిపి పెద్దలు..టిడిపి



మైనింగ్ మాఫియాలో వైసిపి పెద్దల హస్తం ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఎంఎల్‌ఎలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీద రవిచంద్రలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సైదాపురంలో ఎలాంటి అనుమతులులేకుండా వైసిపినేతలు అక్రమంగా రాళ్ల తరలిస్తున్నారన్నారు. ఇప్పటికే వెయ్యి కోట్ల సంపద తరలిపోయిందని, మరో రూ.500 కోట్ల సంపద సిద్ధంగా ఉందన్నారు. వైసిపి పెద్దల ఇందులో సూత్రధారులుగా ఉన్నారన్నారు. జిల్లా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రోజూ వందల లారీలు, హిటాచీలు, టిప్పర్లు అక్కడ పనిచేస్తున్నాయని, అటవీ, ప్రభుత్వ భూములు తవ్వేస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. ఈ వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో వైసిపి ఎన్నికలకు సిద్ధమవుతోందన్నారు.

75శాతం టిడిపి వారే : అనిల్‌కుమార్



సైదాపురం మండలంలో వేల కోట్ల రూపాయల విలువైన తెల్లరాయి అక్రమంగా రవాణా కావడం నిజమేనని వైసిపి నేత, మాజీ మంత్రి, నెల్లూరు ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మీడియాతో మాట్లాడిన ఆయన ఐదు నెలల నుంచి ఈ మాఫియా సాగుతోందని, ఈ మాఫియాలో 75 శాతం మంది టిడిపి నేతలున్నారని ఆయన చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. లీజు లేకపోయినా, అయిపియస్ లేకపోయినా తెల్లరాయి దోచుకుపోతున్నారన్నారు. అధికారులపై కూడా ఆయన ఆరోపణలు చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలకు అనుకూలంగా వారు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకుపోతానని చె అన్నారు.

చిలమత్తూరులో కొనసాగుతున్న పేదల భూపోరాటం

ప్రజాశక్తి-చిలమత్తూరు (శ్రీ సత్యసాయి జిల్లా)

చిలమత్తూరు మండలం కోడూరు 805లో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన భూ స్వాధీన పోరాటం పండుగ రోజునా కొనసాగింది. గత 40 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్న పేదలు సోమ, మంగళవారాల్లో దసర వేడుకలను భూ స్వాధీన స్థలంలోనే నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు దసరా పండగును వారు వేసుకున్న గుడిసెల స్థలంలోనే మంగళవారం జరుపుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులతో కలిసి ఆటపాటలు, నృత్యాలు నిర్వహించారు. తొలుత లేఅవుట్‌లో సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలమత్తూరులో ఇళ్ల స్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాటం జిల్లాకే ఆదర్శమన్నారు. సమిష్టి జీవనం.. సమిష్టి కృషితో ఇళ్ల పట్టాలను సాధించేలా పోరాటం కొనసాగిస్తామని ఇళ్ల స్థలాల సాధన సమితి కార్యదర్శి చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

దేశంలో అపారమైన అవకాశాలు

- ప్రస్తుత విద్యావిధానంలో ఎస్‌టిఇఎమ్‌కి ప్రాధాన్యత
- విజ్ఞాన్స్ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ అవకాశాలు కలిగిన దేశం భారత దేశమని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గుంటూరు జిల్లా, వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విదేశాల నుంచి 13 మేజర్ స్టార్టప్ కంపెనీలు మనదేశంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని తెలిపారు. ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను మన దేశంలో తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తాయన్నారు. సాఫ్ట్‌వేర్, ఐటి కంపెనీలలో విద్యార్థులు ఉద్యోగాలను వెతుకోక్కుండా మెటీరియల్స్, రేర్ మినరల్స్, మెటీరియల్ సైన్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాలలో పరిశోధనలకు పూనుకోవాలని సూచించారు. దీనికి అనుగుణంగా ప్రస్తుత విద్యావిధానంలో ఎస్‌టిఇఎమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమాటిక్స్)కి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సహజసిద్ధమైన గ్యాస్ టెక్నాలజీ మీద కూడా పరిశోధనలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, శాసన వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరికీ అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని ఒడిసిపట్టుకోవాలని సూచించారు. స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, హైదరాబాద్‌లోని విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పి వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరిచ్చి రైతులను ఆదుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

సాగునీరు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, సాగునీరిచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను రైతుసంఘం నాయకులు మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు దక్కే పరిస్థితి లేకుండాపోయిందని, అప్పులు తీరే మార్గం కనుచూపు మేరలో కనిపించడంలేదని రైతు సంఘం నాయకుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యుత్ కోతలు లేకుండా తొమ్మిది గంటలు నిరంతరాయంగా నాణ్యమైన కరెంట్ వ్యవసాయానికి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై అప్పుల భారం పెరిగిందని, పంటలు పూర్తయ్యేంత వరకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి సాగునీరు ఇవ్వాలని కోరారు. పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కలిసి ప్రయాణం

- 29, 30, 31 తేదీల్లో జిల్లా స్థాయిల్లో ఉమ్మడి సమావేశాలు
- లోకేష్, పవన్ కల్యాణ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, లోకేష్ తదితరులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విజయదశమి రోజున టిడిపి-జనసేన కలయిక రాష్ట్రానికి మేలు చేస్తుందని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కలిసి ప్రయాణం చేయాలని నిర్ణయం తీసుకున్నామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో టిడిపి-జనసేన జెఎసి తొలి సమావేశం సోమవారం జరిగింది. అనంతరం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. తొలుత జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వైసిపి అరాచకాలకు జనసేన, టిడిపి ప్రభుత్వమే విరుగుడని అన్నారు. రాష్ట్రంలో సుస్థిరమైన పాలన అందించడంపైనే చర్చలు జరిపామని తెలిపారు. బిజెపి నాయకత్వం ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుందని, తమతో కలిసి రావడానికి సానుకూలంగా ఉందని చెప్పారు. 70 ఏళ్లు పైబడిన సీనియర్ నేతను సెంట్రల్ జైలులో అక్రమంగా నిర్బంధించి బెయిల్ రాకుండా చేయడం బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. నాసిరకం మద్యాన్ని ఏరులై పారించి రూ.30 వేల కోట్లు దోచుకుందని ఆరోపించారు. ఇసుక, మినరల్స్, ఖనిజ దోపిడీకి పాల్పడుతుందని విమర్శించారు. ఉద్యోగులను సిపిఎస్ విషయంలో మోసగించిందని తెలిపారు.

లోకేష్ మాట్లాడుతూ రాబోయే వంద రోజుల్లో ఎలా కలిసి ముందుకెళ్లాలనే విషయమై చర్చించామన్నారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో జిల్లా స్థాయి సమావేశాల అనంతరం మేనిఫెస్టోను రూపొందించుకుంటామని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా జగన్ పాలనలో సామాజిక అన్యాయం జరుగుతోందన్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎందరో దళితులు హత్యకు గురయ్యారని తెలిపారు. దళితులకు గతంలో అమలైన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో 34 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ప్రభుత్వ చేతగానితనం వల్ల సాగునీటి ప్రాజెక్టులు పనికిరాకుండా పోయాయని విమర్శించారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం 3వ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందన్నారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణ చేపడతామని అన్నారు. ఏ తప్పూ చేయని చంద్రబాబును 44 రోజులుగా జైల్లో పెట్టారన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో టిడిపి నాయకులు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, జనసేన పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

జెఎసి సమావేశంలో మూడు తీర్మానాలు

తొలి జెఎసి సమావేశంలో మూడు తీర్మానాలను చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ తీర్మానం చేశారు. అరాచకపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, అన్ని వర్గాలను అభివృద్ధిబాటలో నడిపించాలని తీర్మానించారు.

చంద్రబాబుతో లోకేష్ ములాఖత్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత చంద్రబాబుతో ఆయన కుమారుడు, పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్, నారా బ్రాహ్మణి సోమవారం ఉదయం 11 గంటలకు ములాఖత్ అయ్యారు. 40 నిమిషాలపాటు ములాఖత్ అనంతరం లోకేష్ జెఎసి సమావేశంలో పాల్గొన్నారు.

సాగు నీరివ్వాలని వరిదుబ్బులతో నిరసన

ప్రజాశక్తి - ఆచంట (పశ్చిమగోదావరి)

సాగు నీరివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం వరి దుబ్బులను రైతులు తలపై పెట్టుకొని నిరసన తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలంలోని ఆచంట వేమవరం శివారు పార్వతీ చెరువు, గుమ్ములూరు రోడ్డు మధ్యలో ఉన్న దేవ కాలువ శివారు లాకుల ప్రాంతంలో సుమారు 200 ఎకరాల వరకూ సాగునీరు అందడం లేదు, పంట కళ్లెదుటే ఎండిపోతోంది. దీంతతో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎపి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఎండిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీరు సాగునీరందించలేకపోవడం సిగ్గుచేటని, రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పంట పొలాలు ఈనిక దశలో ఉండడం, మరోవైపు వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగునీరందక కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏటా పంట కాలువల ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉందని, తూతూమంత్రంగా కలుపు మందు కొట్టి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఇరిగేషన్ డిఇఇ సిహెచ్ ఎస్‌వివి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొంతు శ్రీనివాసరావు, కౌలు రైతులు ఉందుర్తి వెంకటేశ్వరరావు, బి రామాంజనేయులు, బి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ ప్యాసింజర్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

దసరా నేపథ్యంలో ప్రయాణికులు, సందర్శకుల రద్దీ దృష్టిలో పెట్టుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో విశాఖపట్నం నుంచి అరకు మీదుగా కిరండూల్ వెళ్లే ప్యాసింజర్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్ (అద్దాల బోగీ)ని జతచేశారు. 08551 విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్ మంగళవారం ఉదయం 6.45కు బయలుదేరి వెళ్లింది. 08552 కిరండూల్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ బుధవారం ఒక అదనపు విస్టాడోమ్ కోచ్‌తో విశాఖకు తిరిగిరానుంది. ప్రతి రోజూ నడిచే ఈ రైలుకు ఇప్పటికే ఒక విస్టాడోమ్ కోచ్ ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా మరొకటి ఏర్పాటు చేయడంతో విశాఖ - అరకు మార్గంలో ప్రకృతి అందాలను రైలులోనుంచే తిలకించే అవకాశం సందర్శకులకు కలగనుంది.

ఆకాశ ఎయిర్ త్వరలో అంతర్జాతీయ సేవలు

న్యూఢిల్లీ : ఆకాశ ఎయిర్ త్వరలో అంతర్జాతీయ రూట్స్‌లో ప్రయాణించడానికి రెడీ అవుతోంది. ఇందుకోసం కొత్త విమానాలకు ఆర్డర్ పెట్టనున్నామని ఆ కంపెనీ సిఇఒ వినయ్ దూబే తెలిపారు. ప్రస్తుతం తమ సంస్థ దేశీయంగా 16 గమ్య స్థానాలకు సేవలందిస్తుందని.. 4.2 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉందన్నారు. భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రస్తుత ఆ సంస్థకు 20 విమానాలు ఉన్నాయి.

సెన్సెక్స్ 826 పాయింట్ల పతనం

న్యూఢిల్లీ : వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లు పతనాన్ని చవి చూశాయి. సోమవారం అమ్మకాల ఒత్తిడితో బిఎస్‌ఇ సెన్సెక్స్ 826 పాయింట్లు పతనమై 64,572కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 261 పాయింట్లు కోల్పోయి 19,282కు క్షీణించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు వరుసగా 2.5 శాతం, 4.18 శాతం చొప్పున నష్టపోయాయి. అక్టోబర్ 24న మంగళవారం దసరా పండగ సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి ఎపి ఛాంబర్స్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కేంద్రం ప్రతిపాదించిన మూడు పారిశ్రామిక కారిడార్లలోని ఆరు ఇండస్ట్రియల్ నోడ్‌లను పూర్తి చేసేందుకు తోడ్పాటు అందించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎపి ఛాంబర్స్ ప్రతినిధులు కోరారు. అలాగే ఎంఎస్‌ఎంఇ లకు సిబిల్‌స్కోర్, క్రెడిట్ రేటింగ్ ఇచ్చే ప్రక్రియను సరళతరం చేయాలని కోరారు. మంగళవారం విజయవాడ వచ్చిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎపి ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, వేర్వేరు రంగాలకు చెందిన ప్రతినిధులు ఓ హోటల్లో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్లను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా అభివృద్ధికి మరింత ఆస్కారం ఉంటుందని తెలిపారు. మల్టీమోడల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పోర్టు ఆధారిత ఎకానమీకి అవకాశం ఉంటుందని మంత్రిని కోరారు. ఎంఎస్‌ఎంఇలకు సంబంధించిన టర్మ్‌లోన్ సిబిల్, క్రెడిట్ రేటింగ్ సమస్యలపైనా వివరించారు. విజయవాడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను పునరుద్ధరించాలని, అన్ని ఎయిర్‌పోర్టుల్లోనూ కోల్డ్ స్టోరేజీ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం రన్‌వేపై రీసర్ఫేసింగ్ సమస్యను పరిష్కరించి విమాన షెడ్యూళ్లకు అంతరాయం లేకుండా చూడాలని కోరగా.. ఆర్థిక మంత్రి అంగీకరించారు. విజయవాడ నుంచి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా తదితర ప్రాంతాలకు వందేభారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని కోరారు. దేశంలో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయినప్పటికీ విజయవాడ నుంచి దూర ప్రాంతం వెళ్లే రైళ్లు లేవని వివరించారు. సిటిఎఫ్‌ఆర్‌ఐ, ఐఐఎఫ్‌టి, ఎన్‌ఐఎఫ్‌టిఇఎం పరిశోధన సంస్థల క్యాంపస్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు మద్దతు ఇచ్చినట్లు ఉంటుందని కోరారు. మిరపకాయలు, జిన్నింగ్ పరిశ్రమలు సేకరించిన ముడిపత్తిపై జిఎస్‌టిని తొలగించాలని, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో జిఎస్‌టిని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలని కోరారు. ఎపిలో ఆయిల్‌పామ్ బోర్డు ఏర్పాటు చేయాలని, బల్క్‌డ్రగ్ పార్కు, కృష్ణపట్నం పారిశ్రామిక కారిడార్లో మెడ్‌టెక్‌జోన్ ఏర్పాటు, టిసిఎస్ తగ్గించడం ద్వారా పర్యాటక రంగం ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలని అన్నారు. ప్రధాన బ్యాంకుల కార్యాలయాలను ఎపికి మార్చాలని కోరారు. దీనికి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐఐ ఎపి ఛాప్టర్ అధ్యక్షులు వెలగపూడి సాంబశివరావు, ఎపి ఎంఎస్‌ఎంఇ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావు, క్రెడాయ్ ఎపి ఛాప్టర్ అధ్యక్షులు రమణరావు, ఎపి హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వి స్వామి, సిఒడబ్ల్యుఇ ఎపి ఛాప్టర్ అధ్యక్షులు రాధిక, బిజెపి ఎపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి పాల్గొన్నారు.

చంద్రబాబు శాశ్వతంగా జైల్లోనే : మంత్రి రోజా

ప్రజాశక్తి -తిరుమల

'నిజం గెలవాలి' అంటూ నారా భువనేశ్వరి యాత్ర చేపట్టనున్నారని, మేమూ అదే కోరుకుంటున్నామని, నిజంగా నిజం గెలవాలి అని చంద్రబాబు సతీమణి అనుకుంటే సిబిఐ విచారణకు డిమాండ్ చేయాలని మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పవన్, లోకేష్ ఇద్దరూ కలిసి పాడుతా తీయగా కార్యక్రమం నిర్వహించారని, ఇటు ఆరుగురు అటు ఆరుగురు కూర్చుని సెలక్షన్ చేశారని, అర సున్న.. అర సున్న కూర్చుని జైల్లో ఉన్న గుండు సున్నా కోసం పార్టీ దశ, దిశపై చర్చించాం అనడం కామెడీగా ఉందని సెటైర్లు వేశారు. 'వై ఎపి నీడ్స్ పవన్ కల్యాణ్, చంద్రబాబు' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లే దమ్ము, ధైర్యం వాళ్ళకు ఉందా? అని ప్రశ్నించారు. అలా వెళ్లితే ప్రజలు వారి పళ్లు రాలగొడతారని, చంద్రబాబు జైల్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు జైల్లోనే శాశ్వతంగా ఉండాలని వెంకటేశ్వరునికి పూజలు చేసినట్లు చెప్పారు. నిజమే గనుక గెలిస్తే జీవితాంతం చంద్రబాబుతో పాటు లోకేష్, భువనేశ్వరి కూడా జైల్లోనే ఉంటారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, ఐఆర్‌ఆర్ కేసులో సిబిఐ ఎంక్వైయిరీని భువనేశ్వరి కోరాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం


దిగజారుడు!

ఐఎఎస్‌లు, సాయుధ బలగాలు, రైల్వేతోసహా మొత్తం ప్రభుత్వ యంత్రాంగంతో గ్రామస్థాయి వరకూ సర్కారు గొప్పలు ప్రచారం చేయించాలని కేంద్రం నిర్ణయించడం దారుణం. తద్వారా ఎన్నికల్లో గెలుపు కోసం ఎంతకైనా దిగజారడానికి సిద్ధమని మోడీ సర్కారు మరోసారి నిరూపించుకుంది. కేంద్ర సర్వీసులలోని జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ) వంటి సీనియర్ అధికారులను 'రథ ప్రభారీలు' (ప్రత్యేక అధికారులు)గా నియమించాలని కేంద్రం నిర్ణయించింది. వారి పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో నవంబర్ 20 నుంచి 2024 జనవరి 25 వరకూ రథయాత్రలు నిర్వహించనుంది. జిపిఎస్, డ్రోన్లు, ఎల్ఇడి స్క్రీన్లతో కూడిన అధునాతన కమ్యూనికేషన్ పరికరాలతో కూడిన ప్రతి రథంలోనూ నలుగురైదుగురు ప్రభుత్వ అధికారులు ప్రయాణించాలని ఆదేశించింది. పరిపాలనా యంత్రాంగమంతా పాలనను గాలికొదిలేసి, మోడీ ప్రచారంలో తలమునకలై, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలన్నది ఈ ఆదేశాల ఆంతర్యం. సెలవులో ఇళ్లకు వెళ్లిన సైనికులు 'సైనికులు-రాయబారులు' పేరుతో కేంద్ర ప్రభుత్వ ప్రచారానికి తమ సమయాన్ని వినియోగించాలని రక్షణ మంత్రిత్వశాఖ మరో ఉత్తర్వు జారీ చేసింది. తటస్థంగా ఉండాల్సిన సైన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనుకోవడం, కఠినమైన శిక్షణలో, అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో సేవలందించిన సైనికులు కుటుంబాలతో గడిపే కొద్దిపాటి విశ్రాంతి దినాలను సైతం హైజాక్ చేయాలనుకోవడం దుర్మార్గం.

దేశ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టడం, భారీ అవినీతి, మత కలహాలు, జాతి కలహాలు, బుజ్జగింపులు, ఎన్నికల బాండ్లు, ఇతర మార్గాల్లో కొల్లగొట్టిన వేల కోట్ల అవినీతి సొమ్మును సోషల్ ఇంజనీరింగ్ పేరుతో కుమ్మరించడం, ఓట్లు కొనడం, ఓటు వేయని వారిపై దాడులు చేయడం, ఆస్తులను తగలబెట్టడం, గెలిచిన ప్రతిపక్ష సభ్యులను కొనేసి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేయడం తరహా ఎత్తుగడలూ మోడీ, అమిత్‌షాల నేతృత్వంలోని కాషాయ ప్రభుత్వానికి కొత్తకాదు. యుపిఎ-2 ప్రభుత్వ వైఫల్యాలు, భారీఎత్తున హామీలను గుమ్మరించి కార్పొరేట్ మద్దతుతో 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు సామాన్యులకు చేసిందేమీ లేదు. భద్రతరీత్యా విమానాల్లో తరలించాలన్న ఆర్మీ విజ్ఞప్తిని బుట్టదాఖలు చేసి, 2019 ఫిబ్రవరిలో పుల్వామాలో 40 మంది సిఆర్‌పిఎఫ్ మరణానికి కారణమైంది. పైగా కార్పొరేట్ ప్రచారంతో ఊదరగొట్టి, ఉగ్రవాదాన్ని ఎజెండాపైకి తీసుకొచ్చి గెలవగలిగింది. కానీ, ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది.

మోడీ హయాంలో 'వెలుగుతున్న భారతదేశం.. నలిగిపోతున్న భారతదేశం...'గా మారిపోయింది. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు జాతీయ సంపద దోచిపెడుతోంది. అదానీ అవినీతిని హిండెన్‌బర్గ్‌సహా అనేక నివేదికలు దుమ్మెత్తిపోసినా నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టు వ్యవహరించింది. కార్పొరేట్లకు గతంలో ఎన్నడూ లేనంతగా దోచిపెడుతుండటం, ఆర్థిక వ్యవస్థ పతనం, నిరుద్యోగం, పేదరికం కారణంగా సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయి. ప్రపంచ ఆకలి సూచీలో 125 దేశాల్లో 111 స్థానానికి దేశం పడిపోయింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, అందరికీ ఇళ్లు, ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డి సౌకర్యం, చౌకగా పెట్రోల్, గ్యాస్, పేదరికం నిర్మూలన, 2022 నాటికి ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లాంటి హామీలేవీ నెరవేర్చే చిత్తశుద్ధి కేంద్రానికి లేదని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మాటల గారడీని, మైనారిటీ, మెజారిటీలుగా విభజించే మతతత్వ విషాన్ని ప్రజలు తిప్పికొడతారని కర్ణాటక ఎన్నికల్లో స్పష్టమైంది. సిబిఐ, ఇడి, ఐటి లాంటి దర్యాప్తు సంస్థను ప్రతిపక్షాలపై ఎగదోయడం, ఎన్నికల కమిషన్, కాగ్ లాంటి స్వతంత్ర సంస్థలను సైతం దుర్వినియోగం చేయడం, అత్యున్నత న్యాయస్థానాలను సైతం ఇబ్బందిపెట్టడం, రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను కాలరాసే నియంతృత్వ విధానాలపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని, సాయుధ బలగాలను దుర్వినియోగం చేయాలనుకోవడం గతంలో ఎన్నడూ దేశం చూడని ఘోరమైన ఎత్తుగడ. ఇప్పటికైనా తాజా ఆదేశాలను ఉపసంహరించడం మోడీ సర్కారు కనీస బాధ్యత.

మహనీయుల మాట



నియంతృత్వం వాస్తవం అయినప్పుడు విప్లవం ఒక హక్కుగా మారుతుంది.

- విక్టర్ హ్యూగో,
ఫ్రెంచి కవి, నవలా రచయిత, నాటకకర్త.

ప్రజా ప్రభాతం

గాజాలో జాతి నిర్మూలన



ప్రభాత్ పట్నాయక్

హమాస్ అక్టోబర్ 7న చేసిన దాడికి ప్రతిస్పందించే పేరుతో గాజా భూభాగం మొత్తాన్ని ఇజ్రాయిల్ భారీ బాంబుల వర్షంతో ముంచెత్తింది. ఆ దాడిలో కనీసం 2000 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. మరో 7000 మందికి పైగా గాయాలపాలయ్యారు. అంతటితో ఆగకుండా గాజాకు ఆహారం, విద్యుత్తు, గ్యాస్, మంచినీరు అందకుండా కట్టడి చేశారు. గత శుక్రవారం గాజా ప్రాంతంలో నివసిస్తున్న 22 లక్షల మంది ప్రజానీకానికి (వీరంతా కేవలం 365 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే జీవిస్తున్నారు) 24 గంటల్లోగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకోడానికి సన్నాహాలు చేస్తోంది. ఐతే గాజా నుండి ఇజ్రాయిల్ పోవడానికి ఉన్న దారులన్నింటినీ మూసివేశారు. గాజా నుండి ఈజిప్ట్ పోవడానికి ఉన్న ఒకే ఒక్క దారినీ బాంబు దాడితో ధ్వంసం చేశారు. దాంతో ఆ దాడిని ఉపయోగించడానికి వీలు లేండా పోయింది. పైగా తన దేశంలోకి పాలస్తీనా శరణార్థుల్ని అనుమతించబోనని ఈజిప్ట్ ప్రకటించింది. అంటే ఇజ్రాయిల్ ఆదేశించినట్టు గాజా భూభాగాన్ని ఖాళీ చేయడం అసాధ్యం అయింది.

ఒకవేళ గాజా నుండి బైటకు రావడానికి దారి తెరచి అనుమతించినా, 10 లక్షల మంది ప్రజానీకాన్ని, అందునా, వృద్ధుల్ని, రోగుల్ని, స్త్రీలను, చిన్నపిల్లల్ని, కేవలం 24 గంటల వ్యవధిలో ఖాళీ చేయించడం సాధ్యమేనా? గంటకు 42,000 మందిని ఖాళీ చేయించాలి. అంటే ఒక్క సెకనులో 12 మందిని ఖాళీ చేయించాలి. ఇది భౌతికంగా అసాధ్యం. ఇటువంటి గడువు విధించడం అంటే గాజా నివాసులను తమ భూభాగపు దాడుల ద్వారా అంతమొందించడాన్ని సమర్ధించుకోడానికి ఇజ్రాయిల్‌కు ఒక సాకు మాత్రమే. "మేం ముందస్తుగానే హెచ్చరించాం. అయినా అక్కడ ప్రజలు ఖాళీ చేయకుండా ఉండిపోతే మరి మా సైనిక బలగాలు ఇంకేం చేస్తాయి?" అని దబాయించడానికి ఈ 24 గంటల గడువు ఒక సాధనం. సైనిక బలగాలు దాడులు చేయకమునుపే ఖాళీ చేయాలన్న ఉత్తర్వులు కలిగించిన భయోత్పాతంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడి పెద్ద సంఖ్యలో జనం అన్ని వైపులా పరుగులు తీస్తున్నారు. దానికి తోడు రోడ్ల మీద బాంబు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా మరిన్ని వేలమంది ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే మన కళ్ళ ముందు ఇప్పుడు ఒక జాతిని నిర్మూలిస్తున్నారు.

"మొత్తంగా గాని, పాక్షికంగా గాని ఒక జాతి, లేదా తెగ లేదా మత సమూహాన్ని నిర్మూలించడానికి చేపట్టే చర్యలను జాతి నిర్మూలనగా పరిగణించాలి" అని 1948 జెనీవా సదస్సులో ఐరాస తీర్మానించింది. ప్రస్తుతం గాజాలో సాగుతున్నది ఆ ఐరాస తీర్మానానికి సరిగ్గా సరిపోతుంది. ఐతే ఈ దారుణాన్ని సామ్రాజ్యవాద శక్తులు సమర్ధిస్తున్నాయి. హమాస్ అనేది ఒక ఉగ్రవాద సంస్థ అని, అది ఇజ్రాయిల్ మీద దుర్మార్గంగా దాడికి తెగబడిందని, భవిష్యత్తులో కూడా హమాస్ నుండి దాడుల ముప్పు ఇజ్రాయిల్‌కు ఉందని, ఉగ్రవాద దాడుల నుండి ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని, హమాస్ దళాలు గాజా ప్రజానీకం వెనుక దాక్కుని ఉన్నందున హమాస్ ను లొంగదీయాలంటే గాజా మీద దాడులు అనివార్యం అని ఇజ్రాయిల్ దాడులను సామ్రాజ్యవాదులు సమర్ధిస్తున్నారు.

హమాస్ ఒక ఉగ్రవాద సంస్థ అని సామ్రాజ్యవాదులు అన్నదానిని నరేంద్రమోడీ వెంటనే సమర్ధించేశారు. మాట వరసకి హమాస్ ఒక ఉగ్రవాద సంస్థ అని అంగీకరించినా, ఒక దేశంలో ఉగ్రవాదులు దాక్కొని వున్నారు అనే సాకుతో ఆ దేశంలోని ప్రజానీకాన్ని తుదముట్టించే హక్కు ఏ దేశానికైనా ఉందని అంతర్జాతీయంగా ఏ చట్టమూ ఒప్పుకోదు. జెనీవా నాల్గవ సదస్సు తీర్మానం ప్రకారం ఏ కొద్దిమందో నేరం చేసినందుకు మొత్తం ప్రజానీకాన్ని, వారు వ్యక్తిగతంగా ఏ నేరమూ చేయకపోయినా, ఉమ్మడిగా శిక్షించడం యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. ఇప్పుడు ఇజ్రాయిల్ చేస్తున్నది ఉమ్మడిగా శిక్షించడం మాత్రమే కాదు. మొత్తం ఒక జాతినే నిర్మూలించే దాడి.

ప్రజలకు నీరు, విద్యుత్తు, ఆహారం అందకుండా నిరోధించడమే యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. సాధారణ పౌరులు జీవించే ప్రాంతాల్లో బాంబు దాడులు చేయడం కూడా యుద్ధ నేరమే ఔతుంది. అటువంటప్పుడు ఆచరించడానికి సాధ్యం కాని ఉత్తర్వులు జారీ చేసి ఆ గడువులోపల ఖాళీ చేయాల్సిందేనని ఒత్తిడి చేయడం కూడా యుద్ధ నేరమే ఔతుంది. ఐరాస కూడా ఇజ్రాయిల్ సాగిస్తున్నది యుద్ధ నేరమేనని ప్రకటించింది. ఇది జాతి నిర్మూలన తప్ప వేరొకటి కాదు.

హమాస్ దాడిలో మరణించిన ఇజ్రాయిలీ పౌరుల మరణాల గురించి వాపోతున్న పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ నేరాల గురించి, అక్కడ ఇజ్రాయిల్ సాగిస్తున్న పాలస్తీనా జాతి నిర్మూలన గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడడం లేదు. అంటే వాళ్ళ దృష్టిలో ఇజ్రాయిల్ పౌరుల ప్రాణాలకే విలువ ఉంది తప్ప పాలస్తీనియన్ల ప్రాణాలకు లేదు. ఇజ్రాయిల్ ప్రభుత్వం పాటిస్తున్న జాత్యహంకార ధోరణినే సామ్రాజ్యవాద దేశాలూ ప్రదర్శిస్తున్నాయి. ఆ ప్రభుత్వానికే మద్దతు కొనసాగిస్తున్నాయి. తమ తప్పుడు వైఖరిని సమర్ధించుకోడానికి వాళ్ళు బూటకపు కథనాలను సృష్టిస్తున్నారు. వాటిని ఇజ్రాయిల్‌లో ఉన్న మత విద్వేష శక్తులు ప్రచారం చేస్తున్నారు. యూదు బిడ్డల తలల్ని హమాస్ సైనికులు నరికివేశారన్నది అటువంటి కట్టుకథల్లో ఒకటి. వీటిని ఆసరాగా చేసుకుని గాజా ప్రాంతాన్ని మొత్తంగా తాము ఆక్రమించుకోవడం సరైనదేనన్న వాదనను ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గ్యాలంట్ ముందుకు తెచ్చారు. "మేం పశువులతో పోరాడుతున్నాం. పశువులతో ఏ విధంగా వ్యవహరించాలో ఆ విధంగానే వ్యవహరిస్తాం" అని ప్రకటించారు.

కాని హమాస్‌ను ఒక ఉగ్రవాద సంస్థగా అభివర్ణించడం అంటే 75 సంవత్సరాల చరిత్రను చూడకుండా కళ్ళు మూసుకోవడమే. ఈ 75 ఏళ్ళ పాటూ పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంటూనే వుంది. పాలస్తీనా ప్రజల్ని దారుణంగా అణచి వేస్తూనే వుంది. చిత్రహింసలపాలు చేస్తూనే వుంది. వారి సంపదలను కొల్లగొట్టి నిరాధారులుగా నిలబెట్టింది. ఇటీవల నేను ఒక అంతర్జాతీయ ట్రిబ్యునల్‌లో న్యాయమూర్తుల బృంద సభ్యుడిగా వ్యవహరించాను. అమెరికన్ సామ్రాజ్యవాదం విధించిన ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటున్న 15 దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు ఆ ట్రిబ్యునల్ ముందు సాక్ష్యం ఇచ్చారు. సుమారు మూడు నెలల ముందు గాజా నుండి వచ్చిన ప్రతినిధి మా ముందు తన సాక్ష్యం వినిపిస్తున్న సమయంలోనే గాజాలో బాంబుల మోత వినపడుతోంది. అక్కడ సాధారణ పౌరులపై బాంబింగ్ జరిగింది. అంటే అది స్పష్టంగా యుద్ధ నేరం ఔతుంది. ఈ విధంగా ఒకదాని వెంట మరొకటిగా ఇజ్రాయిల్ సాగించిన యుద్ధ నేరాలు గత కాలంలో సామ్రాజ్యవాదులు వలసలను ఆక్రమించుకుని అక్కడి స్థానికులను సామూహికంగా నిర్మూలించిన సందర్భాలను గుర్తుకు తెస్తున్నాయి. ఈ దాడులకు పరాకాష్ట అల్-అక్సా మసీదును ధ్వంసం చేయడం. హమాస్ దాడిని పురికొల్పిన వరుస సంఘటనల క్రమం ఇది.

> హమాస్‌ను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఒక సంస్థగా చూసేబదులు కేవలం ఒక ఉగ్రవాద సంస్థగా పరిగణించడం అంటే పాలస్తీనా ప్రజానీకాన్ని లొంగ దీసుకోడానికి ఇజ్రాయిల్ సాగిస్తున్న అన్ని రకాల దుర్మార్గాలనూ విస్మరించడమే. అది అన్యాయమే కాదు, అనైతికం కూడా. దీనర్థం మనం హమాస్ చేస్తున్నదంతా సక్రమమేనని సమర్ధిస్తున్నట్టు ఎంతమాత్రమూ కాదు. ఇజ్రాయిల్ ప్రభుత్వం, దాని కొమ్ము కాస్తున్న పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ఒక జాతికి చెందిన ప్రజలను పాదాక్రాంతం చేసుకోడానికి, వారికి చెందిన భూభాగాన్ని ఆక్రమించుకోడానికి సాగిస్తున్న బల ప్రయోగాన్ని చాలా న్యాయమైనదిగా చెప్పుకోవడం ఎంతమాత్రమూ చెల్లదు అని స్పష్టం చేయాలి.

అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం, ఇజ్రాయిల్ బలవంతంగా తమ భూభాగాలను ఆక్రమించుకుంటున్నప్పుడు సాయుధ ప్రతిఘటనతో సహా అన్ని రకాలుగా ఎదుర్కొనే హక్కు పాలస్తీనియన్లకు ఉంది. 1983లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానం ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది: "తమ స్వాతంత్ర్యాన్ని, సరిహద్దులను, జాతీయ సమైక్యతను కాపాడుకోడానికి, వలసాధిపత్యం నుండి, జాతి వివక్షత నుండి, విదేశీ ఆక్రమణ నుండి విముక్తి సాధించడానికి, సాయుధ పోరాటంతో సహా అన్ని రకాల పోరాటాలనూ చేపట్టే అధికారం పాలస్తీనా ప్రజలకు ఉంది" అని ఆ తీర్మానం స్పష్టం చేసింది. హమాస్‌ను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఒక సంస్థగా చూసేబదులు కేవలం ఒక ఉగ్రవాద సంస్థగా పరిగణించడం అంటే పాలస్తీనా ప్రజానీకాన్ని లొంగ దీసుకోడానికి ఇజ్రాయిల్ సాగిస్తున్న అన్ని రకాల దుర్మార్గాలనూ విస్మరించడమే. అది అన్యాయమే కాదు, అనైతికం కూడా.

దీనర్థం మనం హమాస్ చేస్తున్నదంతా సక్రమమేనని సమర్ధిస్తున్నట్టు ఎంతమాత్రమూ కాదు. ఇజ్రాయిల్ ప్రభుత్వం, దాని కొమ్ము కాస్తున్న పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ఒక జాతికి చెందిన ప్రజలను పాదాక్రాంతం చేసుకోడానికి, వారికి చెందిన భూభాగాన్ని ఆక్రమించుకోడానికి సాగిస్తున్న బలప్రయోగాన్ని చాలా న్యాయమైనదిగా చెప్పుకోవడం ఎంతమాత్రమూ చెల్లదు అని స్పష్టం చేయాలి. ఇజ్రాయిల్‌లో సైతం అంతకంతకూ ఎక్కువమంది ప్రజలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నారు. "సమస్యాత్మకంగా ఉన్న" కొద్దిమంది "ఉగ్రవాదులను" గనుక ఏరిపారేస్తే ఇజ్రాయిల్‌కు శాంతి సుస్థిరంగా ఏర్పడుతుంది అన్న ఒక తప్పుడు అభిప్రాయాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు తెస్తోంది. గత 75 సంవత్సరాల కాలంలోనూ అటువంటి శాంతిని ఎందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వం నెలకొల్పలేకపోయింది? అన్న ప్రశ్నకు దాని వద్ద సమాధానం లేదు. ప్రస్తుతం సాగిస్తున్న జాతి నిర్మూలన కార్యక్రమాల వంటివి పాలస్తీనా ప్రజల తరఫున పోరాడే ఏదో ఒక సంస్థ నుండి (అది హమాస్ కావచ్చు, మరేదైనా కావచ్చు) తప్పకుండా ప్రతీకార చర్యలకు దారి తీస్తాయి. మరిన్ని ప్రాణాలు పోతాయి. మరింత హింసాకాండ చెలరేగుతుంది.


చరిత్రలో యూదు జాతీయులు అనుభవించిన కష్టాలను, ముఖ్యంగా యూరప్ లో నాజీల చేతుల్లో వారనుభవించిన బాధలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాతంత్రవాదులంతా సానుభూతితోనే చూశారు. ఐతే ఇప్పుడు ఇజ్రాయిల్ ప్రభుత్వం, దాని కొమ్ముకాస్తున్న సామ్రాజ్యవాదులు గతకాలపు అనుభవాలను ఇప్పుడు ప్రస్తావిస్తూ తాము సాగిస్తున్న దాడులను సమర్ధించుకుంటున్నారు. ఆ క్రమంలో ఆ నాటి యూదు జాతీయులపై సాగిన ఊచకోత ప్రాధాన్యతను తగ్గించి వేస్తున్నారు. ఒకప్పుడు యూదులు ఏ విధమైన బాధలను, ఊచకోతను నాజీల నుండి ఎదుర్కొన్నారో, ఇప్పుడు పాలస్తీనా ప్రజల మీద వాటినే ఇజ్రాయిల్ ప్రయోగిస్తోంది. 1943లో వార్సా నిర్బంధ కేంద్రాల నుండి యూదులు నాజీల మీద సాగించిన తిరుగుబాట్లకు, ప్రస్తుతం గాజాలో జరుగుతున్న పరిణామాలకు మధ్య సామ్యం చూస్తున్నారు కొందరు. కాని నెతన్యాహుకి మాత్రం ఇవేమీ పట్టడం లేదు. సామ్రాజ్యవాదుల దన్ను చూసుకుని రెచ్చిపోతూ తన ఫాసిస్టు విద్వేష వైఖరినే ప్రదర్శిస్తున్నాడు. "యూదు వ్యతిరేకత"ను అదుపు చేసే సాకుతో ఫ్రెంచి ప్రభుత్వం తన దేశంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపే ప్రదర్శనలను నిషేధించింది. తక్కిన పశ్చిమ సంపన్న దేశాలలో కూడా ఇదే మాదిరి ఆంక్షలు విధించారు.

ఇప్పుడు ఇజ్రాయిల్‌కు, హమాస్‌కు నడుమ సాగుతున్న యుద్ధానికి వెంటనే ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. సంప్రదింపుల ద్వారా పాలస్తీనా సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని సాధించాలి. ప్రస్తుతం పాలస్తీనా లో జరుగుతున్న జాతి నిర్మూలనను ఆపాలి. ఆ ప్రజలపై ఇజ్రాయిల్ విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. గాజా భూభాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని ఇజ్రాయిల్ విడనాడాలి. సమస్యను పరిష్కరించవలసిన ఐరాస ఇప్పుడు చేష్టలుడిగి నిస్సహాయంగా ఉండిపోయింది. భద్రతా మండలిని పని చేయనివ్వకుండా సామ్రాజ్యవాదులు అడ్డుకోవడమే దానికి కారణం. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ప్రజలందరినీ కదిలించడమే ఏకైక మార్గం.

(స్వేచ్ఛానుసరణ)


★


> **ఇప్పుడు ఇజ్రాయిల్‌కు, హమాస్‌కు నడుమ సాగుతున్న యుద్ధానికి వెంటనే ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. సంప్రదింపుల ద్వారా పాలస్తీనా సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని సాధించాలి. ప్రస్తుతం పాలస్తీనా లో జరుగుతున్న జాతి నిర్మూలనను ఆపాలి. ఆ ప్రజలపై ఇజ్రాయిల్ విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. గాజా భూభాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని ఇజ్రాయిల్ విడనాడాలి. సమస్యను పరిష్కరించవలసిన ఐరాస ఇప్పుడు చేష్టలుడిగి నిస్సహాయంగా ఉండిపోయింది. భద్రతా మండలిని పని చేయనివ్వకుండా సామ్రాజ్యవాదులు అడ్డుకోవడమే దానికి కారణం. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ప్రజలందరినీ కదిలించడమే ఏకైక మార్గం.**



విమర్శ

చరిత్ర, సైన్స్‌పై కేంద్రం దాడి ఎందుకు?





జి. వెంకటేశ్వరరావు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్.సి.ఇ.ఆర్.టి (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్) పాఠ్యపుస్తకాల లోని ముఖ్యమైన చారిత్రక, సైన్స్ అంశాలను తొలగించి ముద్రించడం దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మారింది. ఎన్.సి.ఇ.ఆర్.టి పాఠశాల విద్యార్థులకు సిలబస్‌ను రూపొందించి పాఠ్య పుస్తకాలను ముద్రిస్తుంది. దేశంలో 24 వేల పాఠశాలలు ఈ పాఠ్య పుస్తకాలను బోధిస్తున్నాయి. లక్షల మంది విద్యార్థులు వీటిని చదువుతున్నారు. 14 రాష్ట్రాలలో 19 స్కూల్ బోర్డులు కూడా ఎన్.సి.ఇ.ఆర్.టి సిలబస్‌ను బోధిస్తున్నాయి. కోవిడ్ సందర్భంగా విద్యార్థులపై భారం తగ్గించాలనే నెపంతో తాత్కాలికంగా తొలగించిన కొన్ని అంశాలను సిలబస్ రేషనలైజేషన్ పేరుతో శాశ్వతంగా తొలగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. కొత్త విషయాలను, వర్తమాన అంశాలను, నూతన ఆవిష్కరణలను సిలబస్‌లో చేర్చడం కోసం మార్పులు, చేర్పులు చేయడం సహజమైన విషయం. కానీ కేంద్ర ప్రభుత్వం...తమకు, తమను నడిపించే మాతృ సంస్థ భావజాలానికి అడ్డంకింగా ఉన్న వాటిని తొలగించడమే వివాదానికి కారణమైంది.

సిలబస్ రేషనలైజేషన్ పేరుతో తొమ్మిదవ తరగతి, పదవ తరగతి సైన్స్ పాఠ్య పుస్తకాల నుండి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, రసాయన శాస్త్రంలో అతి ముఖ్యమైన అంశంగా భావిస్తున్న పిరియాడికల్ టేబుల్ (ఆవర్తన పట్టిక) కూడా తొలగించారు. 12వ తరగతి పాఠ్య పుస్తకం నుండి ముఖ్యమైన చారిత్రక అంశాలు మొఘలుల పరిపాలన, గాంధీజీ హత్య, 2002 గుజరాత్ అల్లర్లు, 11వ తరగతిలో లైఫ్ ఆన్ ఎర్త్, 12వ తరగతి రాజనీతి శాస్త్రం లోని ప్రజా ఉద్యమాలు, థీమ్స్ ఇన్ ఇండియన్ హిస్టరీ లోని అండర్‌స్టాండింగ్ పార్టిషన్ అనే పాఠం, ది స్టోరీ ఆఫ్ ఇండియన్ డెమొక్రసీ వంటి అంశాలతో పాటు అనేక అంశాలను తొలగించారు.

తొలగించిన అంశాలను పరిశీలిస్తే...శాస్త్రీయ ఆలోచనలను పెంపొందింపజేసే సైన్స్, చారిత్రక అంశాలను మార్చడం ద్వారా భావితరాల ఆలోచనా విధానాన్ని తమ సిద్ధాంతానికి అనుగుణంగా మార్చడమే లక్ష్యంగా ఈ సిలబస్ తొలగింపులు సాగాయనే అనుమానాలు వస్తున్నాయి. ఈ భూమి మీద జీవి పుట్టుక గురించి, మానవుని పరిణామ క్రమం గురించి శాస్త్రీయంగా వివరించే ఏకైక సిద్ధాంతం, ఈ ప్రపంచంలో అత్యధిక మంది శాస్త్రవేత్తలు ఆమోదించే సిద్ధాంతం డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం. జీవ పరిణామ సిద్ధాంతం అనేది బయాలజీలో ఒక విభాగంగానే కాకుండా మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి అతి ముఖ్యమైనది. విద్యార్థులు ఈ జీవ పరిణామ సిద్ధాంతం గురించి, డార్విన్ గురించి తెలుసుకోకుండా పాఠశాల విద్యను పూర్తి చేయడమంటే జీవి పుట్టుక గురించి పురాణాలు, మత గ్రంథాలలో తెలియజేసే అశాస్త్రీయ అంశాలతో వారి మెదళ్లను నింపేందుకే. ఇది భవిష్యత్తు తరాలు శాస్త్రీయ ఆలోచనల వైపు వెళ్లకుండా చేసే పెద్ద కుట్రలో భాగంగానే జరుగుతుందా? 2018లో మానవ వనరుల శాఖ మంత్రి "డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం పూర్తిగా తప్పు. మనిషి భూమి మీద పుట్టినప్పటి నుండి మనిషిగానే ఉన్నాడు. కోతి నుండి మనిషిగా మారడం అనేది ఎవరూ చూడలేదు. అందువలన దీన్ని కరిక్యులం నుండి తొలగించాలి" అని పార్లమెంటు సాక్షిగా మాట్లాడారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్...ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లోనే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం కంటే దశావతార సిద్ధాంతం గొప్పదని మాట్లాడారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో ఆవు పేడ, ఆవు మూత్రం కోవిడ్‌ని తగ్గిస్తాయని అనేక మంది బిజెపి ఎంపీలు అశాస్త్రీయ అంశాలను ప్రచారం చేయడం చూశాం. కానీ సైన్స్ ద్వారా కనిపెట్టిన వ్యాక్సిన్ మాత్రమే మానవ సమాజాన్ని కాపాడగలిగింది. నేడు మానవుడు తన జ్ఞానంతో, శ్రమతో కనిపెట్టిన అనేక నూతన ఆవిష్కరణలను పురాణాల కాలంలో ఉన్నాయని ప్రచారం చేస్తున్న నేటి పాలకులు వాటిని చిన్నారుల మెదళ్ళలోకి ఎక్కించేందుకు అనువుగా పాఠ్యపుస్తకాల లోని శాస్త్రీయ అంశాలను కూడా తొలగించే కుట్ర చేస్తున్నది.

మరోవైపు చరిత్రలో తమ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న అనేక అంశాలను మార్చే ప్రయత్నం తీవ్రతరం చేసింది. పాలకులు మారుతుంటారు కానీ చరిత్ర మారదు. మొఘలుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించినప్పటికీ తాజ్‌మహల్, ఫతేపూర్ సిక్రీ వంటి అనేక చారిత్రక కట్టడాలు, నిర్మాణాలు, మొఘలుల కాలం నాటి సాంస్కృతిక గుర్తులు ఈ దేశంలో విస్తరించి ఉన్నాయి. వాటిని ఎవరూ మార్చలేరు కదా? చరిత్రకు సంబంధించిన కొన్ని ప్రత్యేక అంశాలను తొలగించడం రెండు రకాల పౌరులను తయారు చేస్తుంది. అదే విధంగా సమాజంలోని చీలికలకు దారి తీస్తుంది-అని మేధావులు, విద్యావేత్తలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు హెచ్చరిస్తున్నారు. గాంధీజీ హత్యకు ప్రధాన కారణం మతోన్మాదం. హిందూ ముస్లింల ఐక్యత కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన గాంధీజీని ఆర్‌ఎస్ఎస్ మతోన్మాదంతో ప్రభావితమైన గాడ్సే కాల్చి చంపాడు. ప్రధాన ముద్దాయి అయిన ఆర్‌ఎస్‌ఎస్‌ని ప్రభుత్వం 1948లో నిషేధించింది. ఈ అంశాలను తొలగించడం ద్వారా...నేటి ప్రభుత్వం, దాన్ని నడిపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్...నాటి తమ విద్రోహ చరిత్రను, రక్తపు మరకలను వదిలించుకోవాలని చూస్తున్నాయి. భారతదేశ విభజన పాఠ్యాంశాన్ని తొలగించడం కూడా దీనిలో భాగంగానే చూడాలి. గోద్రా ఘటన అనంతరం నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2002 గుజరాత్ అల్లర్లలో 2000 పైగా ముస్లింలు ఊచకోతకు గురికావడం ఇంకా దేశం మరిచిపోలేదు. ఈ మధ్యకాలంలోనే బిబిసి డాక్యుమెంటరీ కూడా ప్రచురించింది. దానిని నేటి ప్రభుత్వం బ్యాన్ చేసింది. ఇప్పుడు పాఠ్య పుస్తకాల నుండి దానిని తొలగించింది. చివరికి భారతదేశ ప్రజాస్వామ్యం వంటి పదాలను కూడా తొలగించింది. రాచరికానికి చిహ్నంగా భావిస్తున్న రాజదండాన్ని ప్రజాస్వామ్యానికి ప్రతీక ఆయన పార్లమెంట్ నందు ప్రతిష్ఠించడం దీనికి కొనసాగింపుగానే భావించాలి. గతంతో ప్రారంభించి, వర్తమానాన్ని తయారుచేసి, భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసేదే చరిత్ర. మానవుని చర్యలు, వాటి వెనకున్న ఆలోచనలను తెలుపుతుంది చరిత్ర. విద్యార్థులకు చరిత్ర గతంలో ఏం జరిగిందనే అవగాహన కల్పిస్తుంది. వారి ఆలోచనా విధానానికి, వారి సొంత భావనలకు ఒక కొత్త రూపాన్ని ఇస్తుంది. సమాజంలో అశాస్త్రీయ అంశాలను పెంపొందించడం, చరిత్ర వక్రీకరణల ద్వారా సమాజంలో విభజనను తీసుకురావడం అనేది ఆ సమాజం అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారుతుంది. అందువలన నేటి పాలకులు సిలబస్‌లో తీసుకు వస్తున్న మార్పులను...పౌర సమాజం, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ వాదులు వ్యతిరేకించి ...శాస్త్రీయ భావాలను, వాస్తవ చరిత్రను భావితరాలకు అందించటమే నేటి కర్తవ్యం.

/ వ్యాసకర్త యుటిఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి,
సెల్:9966135289 /

> **మరోవైపు చరిత్రలో తమ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న అనేక అంశాలను మార్చే ప్రయత్నం తీవ్రతరం చేసింది. పాలకులు మారుతుంటారు కానీ చరిత్ర మారదు. మొఘలుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించినప్పటికీ తాజ్‌మహల్, ఫతేపూర్ సిక్రీ వంటి అనేక చారిత్రక కట్టడాలు, నిర్మాణాలు, మొఘలుల కాలం నాటి సాంస్కృతిక గుర్తులు ఈ దేశంలో విస్తరించి ఉన్నాయి. వాటిని ఎవరూ మార్చలేరు కదా? చరిత్రకు సంబంధించిన కొన్ని ప్రత్యేక అంశాలను తొలగించడం రెండు రకాల పౌరులను తయారు చేస్తుంది. అదే విధంగా సమాజంలోని చీలికలకు దారి తీస్తుంది-అని మేధావులు, విద్యావేత్తలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు హెచ్చరిస్తున్నారు.**

అభిప్రాయం

నిరుద్యోగుల ఆత్మహత్యలు

దేశంలో ప్రతి యేటా నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2019లో దేశవ్యాప్తంగా 1,39,123 మంది ఆత్మహత్యలు చేసుకోగా, వీటిలో 14,019 మంది నిరుద్యోగులే. 2018లో 1,34,516 మంది ఆత్మహత్య చేసుకోగా, వీరిలో 12,936 (9.6 శాతం) నిరుద్యోగులు. 2017లో 1,29,788 మంది ఆత్మహత్య చేసుకోగా, అందులో 12,241 (9.4 శాతం) మంది నిరుద్యోగులు. 2016లో 1,31,008 మంది ఆత్మహత్యలు రికార్డ్ కాగా, అందులో 11,173 మంది (8.5 శాతం) నిరుద్యోగులు. 2015లో ఆత్మహత్య చేసుకున్న వారిలో నిరుద్యోగుల శాతం 8.2 కాగా, 2014లో 7.5 శాతముంది. కాగా, 2021లో రైతుల ఆత్మహత్యల సంఖ్య 10,881 ఉంటే...ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 13,089 ఉందని పార్లమెంట్ స్థాయి సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు సరైన పరిష్కార మార్గాలు చూపలేకపోతు న్నాయి. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి..ఆ తర్వాత పట్టించుకోవడం మానేస్తున్నాయి. పోటీ పరీక్షల్లో విఫలమైన వారికి ప్రభుత్వాలు ప్రత్యేక కౌన్సెలింగ్ సెంటర్లు అందుబాటులో ఉంచితే మంచిది. ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ప్రయివేటు రంగంలో నూ కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలి.

- ఫిరోజ్ , సెల్ : 9640466464

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

- 24 గంటల్లో 700 మంది పైగా పౌరుల మృతి
- 400కి పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు



మారణకాండ

గాజా
మృతులు : 5791
క్షతగాత్రులు : 16,297

ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్
మృతులు : 96
క్షతగాత్రులు : 1828

ఇజ్రాయిల్
మృతులు : 1405
క్షతగాత్రులు : 5431

గాజా సిటీలోని అల్ వఫా ఆసుపత్రి భవనం సమీపంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడులతో కమ్ముకున్న పొగ

గాజా, జెరూసలేం : అమెరికా, బ్రిటన్,జర్మనీ, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయిల్ రెచ్చిపోతోంది. హమాస్ ప్రతిఘటనా దాడిని సాకుగా చూపి అక్టోబర్7 నుండి గాజాపై భీకర వైమానిక దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ సోమవారం ఒక్క రోజే 700మందికిపైగా పాలస్తీనీయులను పొట్టనబెట్టుకుంది. గత మూడు వారాల్లో ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో 2వేల మంది చిన్నారులతో సహా 5, 887 మంది చనిపోయారు. 18వేల మందికిపైగా గాయపడ్డారు. దాదాపు పది లక్షల మంది శరణార్థులుగా మారారు. వేలాది భవనాలు నేలమట్టమయ్యాయి. ఆసుపత్రుల్లో జనరేటర్ల కోసం ఇంధన నిండుకుందని, చిన్నారులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారని గాజా ఆసుపత్రుల అధికారులు దయనీయస్థితిలో వేడుకుంటున్నా ఇజ్రాయిల్ కనికరించడం లేదు.

ఇంధన ట్యాంకులు ఆసుపత్రులకు చేరకుండా సరిహద్దు ప్రాంతాల్లోనే నిలిపివేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఎ) సైతం గాజాకు మానవతా సాయం అత్యవసరంగా అందాల్సివుందని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ప్రత్యేకించి ఇంధనం చాలా కీలకంగా మారిందని, ఈ దశలో పూర్తి స్థాయిలో సురక్షితమైన మానవతా సాయం అందాల్సి వుందని డబ్ల్యుహెచ్ఎ ప్రాంతీయ అత్యవసర పరిస్థితుల డైరెక్టర్ డాక్టర్ర ఇక్ బ్రెన్నన్ కోరారు. తమ సహాయ కార్యకర్తలకు ఎలాంటి రక్షణ కల్పించడం లేదని ఐక్యరాజ్య సమితి సంస్థలు తెలిపాయి. గాజాలోకి మరింత సాయం వెళ్ళేలా చూడాలని ఐక్యరాజ్య సమితి ఇజ్రాయిల్‌ను మరోమారు కోరింది. వేలాదిమంది ప్రజలు విపత్కర పరిస్థితుల్లో వున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

పదాతి దళాలు


ఇజ్రాయిల్, గాజాకు సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో ఇజ్రాయిల్ ట్యాంకులు, బలగాలు మోహరించి వున్నాయి. పదాతిదళ దాడికి ఆదేశాలు కోసం ఎదురుచూస్తున్నారు. గతరాత్రి గాజాలో 400కి పైగా మిలిటెంట్ లక్ష్యాలపై దాడిచేశామని ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. ముగ్గురు డిప్యూటీ కమాండర్లతో సహా పెద్ద సంఖ్యలో హమాస్ మిలిటెంట్లను హతమార్చామని వెల్లడించింది.

నెతన్యాహుకు మాక్రాన్ వత్తాసు

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు యుద్ధోన్మాదంతో రెచ్చిపోతుంటే పశ్చిమ దేశాల నేతలు ఒక్కొక్కరూ వచ్చి ఆయనకు వత్తాసు పలుకుతున్నారు. బైడెన్, ఒలాఫ్ షుల్జ్, సునాక్, తాజాగా మాక్రాన్ ఇజ్రాయిల్‌ను సందర్శించి హమాస్‌పై దాడులకు మరింత ఆజ్యం పోస్తున్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీతో సహా ప్రపంచ వ్యాపితంగా ప్రజలు ఇజ్రాయిల్ దాష్టీకాలను ఖండిస్తూ భారీ ర్యాలీలు నిర్వహిస్తుంటే, వాటిని లెక్కచేయకుండా ఈ సామ్రాజ్యవాద దేశాల నేతలు ఇజ్రాయిల్‌కు కొమ్ముగాస్తున్నారు. మంగళవారం టెల్ అవీవ్‌కు చేరుకున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ అయి ఇజ్రాయిల్‌తో భుజం భుజం కలిపి నడుస్తామని చెప్పారు. ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకుని గాజా నుండి పాలస్తీనీయులను పూర్తిగా తరిమేసేందుకు ఇజ్రాయిల్ భారీ కుట్ర పన్నినట్టు వార్తలొస్తున్నాయి.

కులతత్వాన్ని, ప్రాంతీయవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలి

- ప్రధాని మోడీ సుద్దులు



న్యూఢిల్లీ : కులతత్వాన్ని, ప్రాంతీయవాదాన్ని సమాజం నుంచి కూకటివేళ్లతో పెకిలించిపారేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి చెడుపై దేశభక్తి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దసరా పండుగ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. న్యూఢిల్లీలోని ద్వారకాలో మంగళవారం జరిగిన దసరా ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. శతాబ్దాల ఎదురుచూపుల తర్వాత అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరుగుతుండటం ప్రజల అదృష్టమని ఆయన చెప్పుకొచ్చారు. త్వరలోనే మందిరం పూర్తవుతుందని, ఇది ప్రజల సహనానికి దక్కిన విజయమని మోడీ చెప్పారు. చంద్రయాన్ విజయవంతం కావడం, నూతన పార్లమెంటు భవన సముదాయాన్ని ప్రారంభించుకోవడం, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురావడం వంటి అనేక అభివృద్ధికర విజయాలను భారత్ ఈ ఏడాది సాధించిందని మోడీ తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధించినట్లు అవుతుందని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక హోదా పెంపొందేలా కనీసం ఒక పేద కుటుంబానికి సహాయం పడటంతో సహా పది ప్రతీనలు ప్రతి పౌరుడు తీసుకోవాలని ఆయన కోరారు. నీటిని పొదుపు చేద్దాం, డిజిటల్ లావాదేవీలు, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం, పనిలో నైపుణ్యాన్ని పెంచుకుందాం, దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహిద్దాం, తృణధాన్యాలను విరివిగా వినియోగిద్దాం వంటి ప్రతీనలను కూడా ప్రధాని ప్రజలతో చేయించారు. చిన్నరాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమంటూ ప్రాంతీయవాదాన్ని పెంచిపోషించే బిజెపి పార్టీలో అగ్రనాయకుడిగా ఉంటూ నిత్యం కులాల మధ్య చిచ్చురాజేసే భావజాలంతో అంటకాగే మోడీ ఇలాంటి నీతులు చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యలు వినిపించాయి.

మరుదు సోదరులకు స్టాలిన్ నివాళి

- 'గాడ్సే గ్యాంగ్'పై విమర్శలు

చెన్నై : స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల వర్థంతి సందర్భంగా మంగళవారం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ 'గాడ్సే గ్యాంగ్'పై విమర్శలు గుప్పించారు. మహాత్మాగాంధీపై చివరి రోజుల్లో విషపూరితమైన విమర్శలు చేసి ఇప్పుడు వీరు అకస్మాత్తుగా జాతీయవాదులుగా మారిపోయారని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళ ప్రముఖ మహాకవి భారతియార్ వీరిని 'యాక్టింగ్ స్వదేశీస్'గా విమర్శించారని స్టాలిన్ గుర్తు చేశారు. తమిళనాడులో స్థానిక స్వాతంత్ర్య సమరయోధులను విస్మరించారని గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ స్టాలిన్ ఈ ప్రతివ్యాఖ్యలు చేశారు. మంత్రులు ఎంపి సామినాథన్, మా సుబ్రమణియన్, చెన్నై మేయర్ ఆర్ ప్రియ, దక్షిణ చెన్నై ఎంపి తమిజాచి తంగపాండియన్, పలువురు ఉన్నతాధికారులు కూడా మరుదు సోదరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జమ్ముకాశ్మీర్ ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

- తరిగామి డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - శ్రీనగర్

జమ్ముకాశ్మీర్ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య రంగానికి వెన్నెముకగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల నిజమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి సిపిఎం నాయకులు మహ్మద్ యూసఫ్ తరిగామి మంగళవారం విజ్ఞప్తి చేశారు. అరకొర వేతనాలకు పనిచేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. వేతనాలు పెంచాలని కొంతకాలంగా ఆశా వర్కర్లు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో సమ్మెలు, ధర్నాలకు దిగాల్సి వస్తోందని, అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదని వాపోయారు. ఐసిడిఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు, సూపర్‌వైజర్లకు గత కొన్ని నెలలుగా వేతనాలు సైతం నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీరికి వేతనాలు చెల్లించాలని, ఇతర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తరిగామి డిమాండ్ చేశారు.

ఢిల్లీలో ఎస్‌ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీలోని ఇజ్రాయిల్ ఎంబసి వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పాలస్తీనాకు సంఘీభావంగా ఇజ్రాయిల్ ఎంబసీ ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను సహా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దాడి చేశారు. మహిళా కార్యకర్తలను రోడ్డుపై ఈడ్చుకెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు. సోమవారం నాడిక్కడ మానవతావాద జోక్యాన్ని కోరుతూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఇజ్రాయిల్ రాయబార కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. శాంతియుత నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో అనుమతి లేకపోయినా పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించింది. అయితే నేతలు, కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. ఇది పోలీసుల క్రూరత్వానికి అద్దంపట్టింది. నాయకులను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి నెట్టారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణన్, సంయుక్త కార్యదర్శి ఆదర్శ్ ఎం సాజీ, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మణిలాల్ అభిజిత్, ఢిల్లీ అధ్యక్షులు ఐషిఘోష్ తదితరులపై దాడి జరిగింది. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు. తమ కార్యకర్తలు, నాయకులపై అసభ్యంగా ప్రవర్తించినందుకు నిరసనగా జాఫర్ పుర్కలన్ పోలీస్ స్టేషన్ వెలుపల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పాలస్తీనాకు సంఘీభావం తెలిపిన విద్యార్థులపై పోలీసుల హింసను ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కమిటీ ఖండించింది. పాలస్తీనా మానవ హక్కుల పట్ల కళ్లు బైర్లు కమ్ముతూ ఇజ్రాయిల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న పాలకుల వైఖరిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది.



నెతన్యాహుపై చర్యలు తీసుకోవాలి

- అంతర్జాతీయ న్యాయ స్థానం ఎదుట భారీ ప్రదర్శన

ది హేగ్ : గాజాలో యుద్ధనేరాలకు పాల్పడినందుకు గాను ఇజ్రాయిల్ ప్రభుత్వాధినేత బెంజమిన్ నెతన్యాహుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్జాతీయ న్యాయ స్థానం ప్రవేశమార్గం ఎదుట పాలస్తీనా అనుకూల కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో, గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ అడ్డూ అదుపు లేకుండా బాంబు దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ ప్రదర్శన జరిగింది. కాగా ప్రదర్శనలో పాల్గొన్న 19 మంది కార్యకర్తలను డచ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం దాటగానే అంతర్జాతీయ న్యాయస్థానం ఎదురుగా గల వంతెనను పాలస్తీనా అనుకూల కార్యకర్తలు స్వాధీనంలోకి తీసుకున్నారు. 'నెతన్యాహు యుద్ధ నేరస్తుడు' అంటూ పతాకాలు చేబూనారు. క్లైమేట్ ఎమర్జన్సీ యాక్టివిస్ట్ గ్రూప్ డచ్ శాఖకు చెందిన కార్యకర్తలు అక్టోబరు 7 నుండి పాలస్తీనా అనుకూల కార్యాచరణ చేపడుతునే వున్నారు. అయితే ఈ ప్రదర్శన వల్ల ఐసిసి సాధారణ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని ఐసిసి ప్రతినిధి సోనియా రొబ్లా తెలిపారు. అదుపులోకి తీసుకున్న 19మందిని విడుదల చేసిన తర్వాత, ఐసిసి గ్రౌండ్స్ వెలుపల పాలస్తీనా అనుకూల నిరసనల్లో వారు పాల్గొన్నారు.

మోడీ కోడ్ ఉల్లంఘన!

- ప్రభుత్వ ఘనకార్యాల ప్రచారానికి అధికారుల నియామకం
- నవంబర్ 20 నుంచి రెండు నెలల పాటు కార్యక్రమం
- ఎన్నికల సంఘానికి పలువురు ఫిర్యాదు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారాన్ని చేపట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలను గురించి ప్రచారం చేసేందుకు, వాటిని ప్రదర్శించేందుకు దేశంలోని మొత్తం 765 జిల్లాల్లో 'రథ్ ప్రభారీ'లను (ప్రత్యేక అధికారులను) నియమించాలంటూ ఈ నెల 17న అన్ని మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆ ఆదేశాలు సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున హల్‌చల్ చేస్తున్నాయి.

'జిల్లాల్లో ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు సహాయ కార్యదర్శులు, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ నుండి గ్రామ పంచాయతీ స్థాయి వరకూ అధికారులను వెంటనే నామినేట్ చేయండి. గత తొమ్మిది సంవత్సరాల మోడీ పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను నవంబర్ 20వ తేదీ నుండి జనవరి 25 వరకూ ప్రచారం చేసేందుకు ఈ అధికారులను ఉపయోగించుకోవాల్సి ఉంది' అని ఆ సర్క్యులర్‌లో మోడీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

మాజీ అధికారుల మండిపాటు

ప్రభుత్వ ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ స్పందించారు. ఈ నెల 21న ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ లేఖ రాస్తూ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, ఆ ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా ఆదేశాలు జారీ చేయడం అంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది. ఇలాంటి చర్యలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. ఎన్డీఏ ప్రభుత్వానికి మేలు చేకూర్చేందుకే ఇలాంటి ఆదేశాలు ఇచ్చారు' అని ఆయన విమర్శించారు.

అధికారులను రథ్ ప్రభారీలుగా నియమించాలంటూ రక్షణ శాఖ సహా అన్ని మంత్రిత్వ శాఖలకు జారీ చేసిన ఆదేశాలపై సీనియర్ అధికారులు కూడా స్పందించారు. 'రక్షణ శాఖ అధికారులను ఎన్డీఏ ప్రభుత్వ విజయాలపై ప్రచారానికి పంపడం ఆందోళన కలిగించే విషయం. దీర్ఘకాలంలో ఇలాంటి చర్యలు మంచివి కావు' అని వారు అభిప్రాయపడ్డారు. మరోవైపు శర్మ లేఖకు మద్దతుగా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ దేవసహాయం కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అయితే ఈ లేఖలపై సీఈసీ ఇంకా స్పందించలేదు. ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్‌సీ సక్సేనా సైతం ప్రభుత్వ చర్యపై ఘాటుగా మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులను ప్రచారానికి వాడుకోవడం తాను ఇప్పటి వరకూ చూడలేదని ఆయన చెప్పారు. ప్రభుత్వోద్యోగులు, రాజకీయవేత్తల మధ్య ఉన్న రేఖను ఇది చెరిపేస్తోందని విమర్శించారు. 'ఒక వైపు ఎన్ఎస్ఎస్ఓ, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ వంటి సమాచార వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ అధిపతి ఇటీవలే రాజీనామా చేశారు కూడా. మరో వైపేమో ప్రభుత్వ పనితీరుపై ప్రచారం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.

ఇందిర హయాంలో...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని ఇందిరాగాంధీ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారంటూ 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు చారిత్రక తీర్పు చెప్పింది. దీంతో ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆమెపై అనర్హత వేటు పడింది. ప్రధాని సచివాలయంలో తనకు సహాయకుడిగా పనిచేస్తున్న యశ్‌పాల్ కపూర్ అనే అధికారిని తన విజయావకాశాలను మెరుగుపరచుకునేందుకు ఇందిర ఉపయోగించుకున్నారని, తద్వారా ఆమె ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ తీర్పు వచ్చిన రోజే గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ (ఐ) ఘోర పరాజయం పొందింది. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్న మోడీ దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. ఇందిరకు వ్యతిరేకంగా 19 ర్యాలీలు, ఆరు రోడ్‌షోలలో ప్రసంగించారు. అయితే ఆయన ఇప్పుడు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించి ప్రచారార్భాటం కోసం ప్రభుత్వ అధికారులను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

చైనా మహిళా సమాఖ్య 13వ జాతీయ మహాసభ ప్రారంభం



బీజింగ్: అఖిల చైనా మహిళా సమాఖ్య (ఎసిడబ్ల్యుఎఫ్) 13వ జాతీయ మహాసభ సోమవారం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో ప్రారంభమైంది. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వాధినేత సీ జిన్‌పింగ్, ప్రధాని లీ కియాంగ్ తదితరులు హాజరై మహాసభకు హాజరైన ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. చైనా నలుమూలల నుంచి 1800 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. వీరిలో హాంకాంగ్, మకావు ప్రత్యేక పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 90 మంది ప్రతినిధులు ఉన్నారు. చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) వైస్ చైర్‌పర్సన్, ప్రిసీడియం ఎగ్జిక్యూటివ్ చైర్ పర్సన్ షెన్ యుయో మహాసభ ప్రారంభమైనట్లు ప్రకటించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ తరపున డింగ్ సియుసియాంగ్ మాట్లాడుతూ, మహిళాభివృద్ధికి పాటుపడుతున్న సోదరీ మణులందరికీ (మకావు, హాంకాంగ్, తైవాన్, ఓవర్సీస్ మహిళలతో సహా) తన శుభాభినందనలు తెలిపారు. గత మహాసభ నుండి ఈ మహాసభవరకు చైనా మహిళలు అన్ని రంగాల్లోను అద్భుతమైన పురోగతి సాధించారని ఆయన ప్రశంసించారు. పేదరిక నిర్మూలన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన అన్వేషణ, కోవిడ్-19పై పోరు, కుటుంబ, సమాజ పటిష్టతలో మహిళల పాత్ర, క్రీడల్లో అసాధారణమైన ప్రతిభా సామర్థ్యాలను ప్రదర్శించారని డింగ్ తెలిపారు.. ఆల్ చైనా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎసిఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి సు లియుపింగ్, ఇతర ప్రజా సంఘాల నేతలు మహాసభలో సౌహార్ద సందేశమిచ్చారు. మహాసభ ప్రెసీడియం ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ హువాంగ్ సియోవెయి ఎసిడబ్ల్యుఎఫ్ 12వ కార్యనిర్వాహకవర్గం తరపున నివేదికను ప్రవేశపెట్టారు.

రక్షణ మంత్రిని తొలగించిన చైనా !

తైపే : రక్షణ మంత్రి జనరల్ లీ షాంగ్ఫూను చైనా తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సిసిటివి పేర్కొన్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. దాదాపు రెండు నెలల నుండి షాంగ్ఫూ ప్రజాబాహుళ్యంలో కనిపించడం లేదని, అందువల్లే ఆయనను తొలగించినట్లు తెలుస్తోందని మీడియా పేర్కొంది. ఈ ఏడాదిలో ప్రజాబాహుళ్యంలో కనిపించని కారణంలో విధుల నుంచి తొలగింపునకు గురైన రెండో సీనియర్ చైనా అధికారి లీ. అంతకుముందు మాజీ విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ కూడా ఇలాగే తొలగింపునకు గురయ్యారు. గత మార్చిలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ సందర్భంగా లీని రక్షణ మంత్రిగా తీసుకున్నారు. ఆగస్టు 29న ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన అనంతరం ఆయన బహిరంగంగా కనిపించలేదు.

అర్జెంటీనా అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి గెలుపు

- నవంబరు 19న రెండో దఫా ఓటింగ్



బ్యూనస్‌ఎయిర్స్ : ఆదివారం జరిగిన అర్జెంటీనా అధ్యక్ష ఎన్నికల్లో మధ్యేవాద వామపక్షవాది సెర్గీ మాస్సా మొదటి స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆగస్టులో జరిగిన ప్రైమరీస్ ఎన్నికల్లో మితవాద కూటమిదే విజయం ఖాయమని అంతర్జాతీయ మీడియా పెద్ద పెద్ద అక్షరాలతో శీర్షికలు ఇచ్చి ప్రచురించింది. . దానికి భిన్నంగా తొలి రౌండ్ ఎన్నికల్లో అర్జెంటీనా ప్రజలు లెఫ్ట్ వైపు మొగ్గు చూపారు. యూనియన్ ఫర్ ది హోమ్‌ల్యాండ్ కొయిలేషన్‌కి చెందిన ఆర్థిక మంత్రి మాస్సా 36.7 శాతం ఓట్లు రాగా, ఫ్రీడమ్ అడ్వాన్సెస్ అలయన్స్‌కి చెందిన మితవాద జేవియర్ మిలెయ్‌కు 30 శాతం ఓట్లు వచ్చాయి. తొలి రౌండ్‌లో ఏ అభ్యర్థికీ 50 శాతం ఓట్లు రానందున, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల మధ్య తుది పోరు నవంబరు 19న జరగనుంది. దేశంలో ద్రవ్యోల్బణం 140 శాతానికి పెరిగిపోయింది. పైగా దేశంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఎగుమతులు తగ్గిపోయాయని, అందువల్ల దుర్భర పరిస్థితులే తనకు వారసత్వంగా వస్తాయని ఆయన చెప్పారు. అయితే ఆ అధ్వాన్న పరిస్థితులన్నీ కూడా ఇక గత కాలమే అవుతుందని, రాబోయేదంతా మంచి కాలమేనని ఆయన వారికి హామీ ఇచ్చారు. రెండో రౌండ్‌లో ఇతర పార్టీల మద్దతు కూడా కావాలని ఆయన కోరారు.

భారత్‌కు శ్రీలంక ఉచిత వీసాలు మరో ఆరు దేశాలకు కూడా

కొలంబొ : ఇకపై భారతీయులు ఉచిత పర్యాటక వీసాలతో శ్రీలంకలో పర్యటించవచ్చు. పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీలంక ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. భారత్‌తో పాటు మరో ఆరు దేశాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు శ్రీలంక విదేశాంగ మంత్రి అలీ సబ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. తక్షణమే అమల్లోకి రానున్న ఈ పైలెట్ ప్రాజెక్ట్ వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. భారత్‌తో పాటు రష్యా, చైనా, మలేషియా, జపాన్, ఇండోనేషియా, థాయిలాండ్ దేశాల పర్యాటకులు ఎలాంటి రుసుము లేకుండా వీసాలను పొందవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీలంక ప్రధాన ఆదాయ వనరైన పర్యాటక రంగంపై కొవిడ్ మహమ్మారితో పాటు ఆదేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక సంక్షోభాలతో తీవ్ర ప్రభావం పడింది. దీంతో పర్యాటక రంగానికి తోడ్పాటు నందించేందుకు శ్రీలంక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అధికారిక లెక్కల ప్రకారం.. గతేడాది సెప్టెంబర్‌లో 30,000 మందికి పైగా భారత పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు.

తీవ్ర తుఫానుగా మారిన అల్పపీడనం 'హమూన్'..

భువనేశ్వర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫానుగా మారింది. ఈ తుఫానుకి 'హమూన్'గా పేరు పెట్టినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం ప్రకటించింది. ఒడిసాకు 200 కి.మీ దూరంలో తీరం దాటే అవకాశం ఉన్నందున ఒడిసాపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 21 కి.మీ వేగంతో దూసుకువస్తున్న ఈ తుఫాను మరికొన్ని గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని అన్నారు. ఒడిసాలోని పారాదీప్‌కు 230 కి.మీ, పశ్చిమ బెంగాల్‌లోని ధిగాకు 240 కి.మీ దూరంలో, బంగ్లాదేశ్‌లోని చిట్టిగాంగ్‌కు 410 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు. ఈశాన్య దిశగా కదులుతున్న తుఫాను క్రమంగా బలహీనపడి మంగళవారం సాయంత్రానికి తీవ్రంగా మారే అవకాశం ఉందని, గంటకు 65 -75 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండి అంచనా వేసింది. బుధవారం బంగ్లాదేశ్‌లోని హెపుపరా, చిట్టిగాంగ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఒడిసాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.

బిజెపికి గౌతమి గుడ్‌బై

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



తమిళనాడు బిజెపి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత, నటి గౌతమి తాడిమళ్ల రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు, తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నమలైకు పంపించారు. ఆ లేఖలో తనను మోసం చేసిన వ్యక్తులకు బిజెపి నేతలు సహకరిస్తున్నారని, అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. "25 ఏళ్లుగా పార్టీని బలపరచడానికి ఎంతో కృషి చేశాను. ఆస్తి, నగదు విషయంలో నన్ను మోసం చేసిన సి.అళగప్పన్ కు కొందరు బిజెపి నేతలు సహకరిస్తున్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ప్రస్తుతం ఊహించలేని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాను. బిజెపి అగ్రనేతలు తనకు మద్దతు ఇవ్వట్లేదు. నా నమ్మకాన్ని వంచించి, నా జీవిత సంపాదనను మోసం చేసిన వ్యక్తికి మద్దతుగా నిలుస్తున్నారు. ఇది సరైనదేనా?. చివరి శ్వాస వరకు న్యాయం కోసం పోరాడతా.." అని లేఖలో పేర్కొన్నారు. పార్టీకి దూరం కావడం బాధగా ఉన్నా.. జరుగుతున్న పరిణామాలన్నీ తనకు వ్యతిరేకంగా ఉన్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

25 కోట్ల విలువైన నిధులు, ఆస్తులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ అళగప్పన్, ఆయన భార్యపై గత నెలలో గౌతమి పోలీసులకు ఫిర్యాదు చేసింది. "2004లో క్యాన్సర్ కారణంగా నా ఆరోగ్యం క్షీణించడంతో, అమ్మకానికి సంబంధించిన ఆస్తులను ప్రాసెస్ చేయడానికి నేను నా పవర్ ఆఫ్ అటార్నీని అలగప్పన్‌కి ఇచ్చాను" అని పేర్కొన్నారు. అళగప్పన్ నుంచి తన ఆస్తులను తిరిగి పొందేందుకు ప్రయత్నించిన తర్వాత తనను, తన కుమార్తెను బెదిరించారని గౌతమి ఆరోపించారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన తరువాత కూడా గత 40 రోజుల నుంచి బిజెపికి చెందిన పలువురు సీనియర్ సభ్యులు అళగప్పన్‌పై చర్యలు తీసుకోకుండా తప్పించుకు తిరుగుతున్నారని తన రాజీనామా లేఖలో గౌతమి ఆరోపించారు. న్యాయం గెలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు కాంగ్రెస్ తొలి జాబితా..!

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సిఇసి) బుధవారం భేటీ కానుంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా... ఈ నెల 15న 55 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసింది. మిగిలిన 64 స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై ఇటీవల రెండుసార్లు భేటీ అయిన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల ప్రతిపాదనలకు సిద్ధం చేసింది. ఇందులో వామపక్ష పార్టీలతో పొత్తు, వారికి కేటాయించే నాలుగు సీట్లు, మిగిలిన 60 స్థానాలపై స్పష్టత వచ్చినట్టుగా తెలుస్తోంది. అయితే ఆ ప్రతిపాదనలను బుధవారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇతర నేతల సమక్షంలో జరిగే సీఈసీలో చర్చించి, ఆమోదించనున్నారు. అనంతరం తుది జాబితా విడుదల కానుంది. ఒకవేళ బుధవారం సమావేశం ముగియడం ఆలస్యం అయితే, గురువారం సీఈసీ ఆమోదించిన అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు. కాగా రాష్ట్రంలో ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు నేతలు నేడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. కొత్తగా పార్టీలో చేరే వీరి కోసం 4-5 స్థానాలను కేటాయించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం స్క్రీనింగ్ కమిటీ రూపొందించిన తుది జాబితాలో స్వల్ప మార్పులు, చేర్పులు జరుగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



మీకోసం

కాలీఫ్లవర్ కూరలో పాలు పోసి వండితే కూర రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

మార్పులేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించు.

వ్యవసాయం



అరకను గట్టి పొలము దున్ని
వడ్లను తెచ్చి నానా పెట్టి
మండెను గట్టి నీరును పోయగా
మూడో రోజుకు మొలకలొచ్చెను

పలుగురాళ్ళకు బొట్లను బెట్టి
మడి మొదటన పూలను పెట్టి
మట్టికి మొక్కి అలుకుడు సేయగ
మూడొద్దులకే నారుగ మొలిచెను

పచ్చని నారును లుంగలు గట్టి
దున్నిన పొలమును సదును చేసి
మాగాణాన నారును పంచి
అమ్మ లక్కలు నాటు వేయగా
కొన్ని నాళ్ళకే ఏపుగా పెరిగెను

ఎదిగిన పంటల
గడ్డి గాలం వొడిపిల్లంతా
పీకి వేయగా గంటలు గట్టిన
పైరూ అంత పచ్చగా పెరిగి
రోజులు గడవగ పొట్టలకొచ్చి
వరిసేనంత వెన్నులు పెట్టెను


గొలుసులు కట్టిన వరి కంకులను
కోయగా జూసి
కోత మిషన్‌తో పంటను కోసి
వడ్ల గింజలను రాసులు పోసి
ఐకెపిల బస్తల కెత్తెను
బస్తాలన్నీ కాంటలు వేసి
లారీలల్ల నింపిన ధాన్యం
గోదాములకు తరలిపోయెను

మడు కట్లల్ల గడ్డిని తీసి
కట్టలు గట్టి వాముగా వేసెను
వడ్లను అమ్మితే డబ్బులు వచ్చెను
ఖాతాలల్ల సిరులు కురిసెను
రైతుల ఇంట్ల నవ్వులు మెరిసెను

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
94415 61655.

జత పర్చండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లు, వాటికెదురుగా అంకెలు, పండ్ల బుట్టలు ఇచ్చాం. పండ్లని లెక్కబెట్టి సరైన అంకెకు, అలాగే పక్కనే ఉన్న పండ్ల బుట్టలో సమాన పండ్లకుజతపర్చండి.





నేను గీసిన బొమ్మ



పి.శేఖర్,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం.
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఐపాన్ కళతో ఐకాన్‌గా ...





సంప్రదాయ కళల్లో భాగమైన హస్తకళల్లోని ఐపాన్ కళలో నిపుణత సాధించి ప్రపంచస్థాయిలో గుర్తింపుపొందారు ఉత్తరాఖండ్‌లోని రామ్‌నగర్ పట్టణానికి చెందిన మీనాక్షి ఖాదీ. తన పూర్వీకుల నుంచి ఎంతో ఆదరణ కలిగిన ఈ కళ నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సైతం కనుమరుగౌతున్న విషయాన్ని ఆమె గ్రహించారు. తిరిగి పూర్వవైభవం తీసుకురావటానికి ఆమె ఆరేళ్లుగా నిర్విరామంగా తన కృషిని కొనసాగిస్తున్నారు. వేలాదిమంది మహిళలకు ఈ కళలో శిక్షణ ఇచ్చిన ఆమె నేడు వారు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి స్వయం సమృద్ధి సాధించేలా కృషిచేస్తున్నారు. ఐపాన్ గర్ల్‌గా పిలువబడుతున్నారు. మీనాక్షి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి సైతం ప్రశంసలు సైతం అందుకున్నారు.

ఉత్తరాఖండ్ రామ్‌నగర్ పట్టణానికి చెందిన 24 ఏళ్లున్న మీనాక్షి ఖాదీ చరిత్రలో డిగ్రీ పూర్తిచేశారు. కుమావోస్ ప్రాంతంలో ఆమె అమ్మమ్మ వాళ్లు ఉండేవారు. దీపావళి, ఇతర పండుగ సందర్భాల్లో తమ కుటుంబ సభ్యులు ఐపాన్ డిజైన్లు (కళాకృతులు) తయారుచేసేవారు. మొదటగా ఈ వస్తువులను చూసినప్పుడు ఆమెకు కేవలం ఆరేళ్లు. తన అమ్మ ఉమ, అమ్మమ్మ కమల ఇళ్లల్లో ఆకర్షణీయమైన డిజైన్లను తయారు చేస్తుండటాన్ని ఆమె తరచూ గమనించారు. అప్పుడే ఈ కళ పట్ల ఆకర్షితులయ్యాయని మీనాక్షి చెబుతుంటారు. కుమావోన్ ప్రాంతంలో ఐపాన్ ఒక సంప్రదాయ జానపద కళ. ఈ కళాకృతులు ఇంట్లో ఉంటే మంచి జరుగుతుందనీ, చెడును నిరోధించే దైవిక శక్తిని ప్రేరేపిస్తుందని కుమావోనిలు (ఆ ప్రాంత ప్రజలు) నమ్ముతారు. కాలం గడుస్తున్న కొద్దీ ఈ కళ అంతరించిపోతోంది. తన పూర్వీకుల నుంచి ఈ కళను నేర్చుకున్న మీనాక్షి ఖాదీ దానిని ప్రపంచానికి తెలియజేయటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

ఉత్తరాఖండ్‌లో దీపావళి, ఇతర పండుగల సమయంలో ఇంటి ప్రాంగణం, గదులు, గోడలు, పూజా గదిని ఐపాన్ కళను ఉపయోగించి తయారు చేసిన మ్యాట్లను అంటించి ప్రత్యేకంగా అలంకరించేవారు. ఈ పనిలో ఇరుగు పొరుగు వారి నుంచి కూడా సహాయం పొందేవారు. నగరాల్లో ఉండే ఈ కళాకృతులకు రానురాను గ్రామీణ ప్రాంతాలకు కూడా ఆదరణ పెరిగింది. గతంలో పెయింటింగ్ కంటే స్టిక్కర్ అలంకరణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటాన్ని ప్రారంభించారు. పెయింటింగ్‌కు సమయం పడుతుందనీ, స్టిక్కర్లను అతికించటం ద్వారా ఇంటిని అలంకరించుకోవచ్చునని వారి భావన. ఈ క్రమంలో చాలా గ్రామాల్లో ఈ కళ దూరమవుతున్న విషయాన్ని మీనాక్షి గమనించారు. ఈ కళను పునరుద్ధరించేందుకు ఆమె చొరవ తీసుకుంది. లోతైన అధ్యయనం చేశారు.



తయారీ విధానం

'బిస్వర్' పేస్ట్‌ను స్థానికంగా ఉండే అడవుల నుంచి సేకరిస్తారు. కుంకుమ-ఎరుపు మట్టిరంగు, 'గేరు'ను ఉపయోగించి తయారుచేసిన కళాకృతులను గోడలు, అంతస్తులపై ఆకర్షణీయమైన మూలల్లో అలంకరణ చేస్తారు. మొదటగా ఐపాన్ పునాదిని 'గేరు' మట్టి నుంచి తయారు చేస్తారు. ఆ తర్వాత 'బిస్వర్' ఉపయోగించి వివిధ డిజైన్లను తయారుచేస్తారు. ఆ తర్వాత మార్కెట్లో ఉంచి విక్రయిస్తుంటారు. తొలుత మీనాక్షి ఉత్సాహంతో ఐపాన్ వస్తువుల తయారీలో ఉండగా మిత్రులు ఈవిడకు ఏమి వచ్చులే అన్నట్లుగా నవ్వుకుంటూ నిట్టూర్చారు. అయినా వెరువక ఆమె పట్టుదల, తన అభిరుచి కొద్దీ తయారీని కొనసాగించారు. తొలుత గంటర్నర వ్యవధిలోనే తొలి ఐపాన్ డిజైన్ చేసినప్పుడు ఆమె అమ్మమ్మ దగ్గరకు తీసుకుని ఆమెను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'అమ్మా నీవు మరింత కష్టపడితే ఈ కళలో నిస్సందేహంగా రాణిస్తావు.. నీకు తిరుగులేదు' అంటూ ఆశీర్వదించింది అమ్మమ్మ. అప్పుడు నిరుద్యోగి ఉన్న మీనాక్షి ఈ కళపై పట్టు సాధించాల్సిందేనంటూ నడుం బిగించారు. పద్మశ్రీ గ్రహీత యశోధర మత్పాల్ వంటి చరిత్రకారులు, పండితులతో మాట్లాడి కొంత సమాచారం తెలుసుకున్నారు. ఈ కళ చరిత్ర, మూలాల్ని తెలుసుకోవటానికి తనకు మూడేళు పట్టిందనీ, లోతుగా అధ్యయనం చేశానని ఓ యువకళాకారుడు ఆమెకు తెలిపాడు. చంద్ రాజవంశం (సుమారు 8వ శతాబ్దంలో) మూలాలు ఉన్నాయని మీనాక్షి నిర్ధారించుకున్నారు. ఐపాన్ వంటి కళారూపాలను దేశంలోని వివిధ ప్రాంతాల్లో అల్పనా, అర్పన్ అని కూడా పిలుస్తారని గ్రహించారామే.

కళకు ప్రాచుర్యమే లక్ష్యం

యువతకు ఈ కళలో నైపుణ్యం పెంపొందించటం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించొచ్చునని భావించారు. 2018 నుంచి నేటి తవరకూ అంటే ఐదేళ్లకాలంలో వృత్తిపరమైన ప్రయాణంలో ఆమె తన ఎన్నో మైలురాళ్లను దాటారు. రాష్ట్రంలో 3,451 మందికి ఆమె శిక్షణ ఇచ్చారు. దేశ విదేశాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలతో సహా 5,241 మందికి ఐపాన్‌పై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. ఇంకా సోషల్ మీడియా, పాఠశాలల్లో వర్కుషాపులు, ప్రదర్శనలు ఇవ్వటం ద్వారా వేలాదిమందికి ఆమె శిక్షణ ఇస్తున్నారు.

పారిశ్రామికవేత్తగా ...

మీనాకృతి ది ఐపాన్ ప్రాజెక్టును ఆమె డిసెంబర్ 2019లో ప్రారంభించింది. ఉత్తరాఖండ్‌లో 4 వేల మందికిపైగా మహిళలు ఈ కళాకృతులను తయారుచేస్తూ జీవనోపాధిని పొందుతున్నారు. వారు తమ ఖర్చుల కోసం, కుటుంబ పోషణ కోసం ఎవరిపైనా ఆధారపడాల్సిన పని లేకుండా పోయింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం రెడ్ కలర్ ఐపాన్ డిజైన్లు, గ్రీటింగ్‌కార్డులు, వాల్ డిజైన్లు, నేమ్ ప్లేట్లు డిజైన్లలో ఐపాన్ ఆర్ట్స్ ప్రదర్శన ఏటేటా పది రోజులపాటు నిర్వహిస్తోంది. వీటిలో కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించటం, వాటికి మార్కెట్లో గిరాకీ ఉంటుండటంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తన వార్షిక ఆదాయం ఇప్పుడు రూ.40లక్షలు దాటిందని మీనాక్షి చెబుతున్నారు.

పలు అవార్డులు

మీనాక్షి మహిళా మాతృశక్తి పురస్కారం, మా నంద శక్తి పురస్కారం, వీర్ బాలికా, కళ్యాణి సమ్మాన్, 2021లో ఉత్తమ పారిశ్రామిక వేత్త వంటి అవార్డులు సైతం అందుకున్నారు. డిసెంబర్ 9, 2022న డెహ్రాడూన్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతిముర్ముతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. కళాకృతులను చూసి ఆశ్చర్యపోయిన రాష్ట్రపతి ప్రత్యేకంగా మీనాక్షిని అభినందించారు. తాను తయారు చేసిన ఫలకాన్ని రాష్ట్రపతికి ఆమె బహూకరించారు.

చరిత్రలో నిలిచిపోయే సినిమా

విజయోత్సవ సభలో బాలకృష్ణ



'అందరికీ విజయదశమి శుభాకాంక్షలు. శక్తికి నిర్వచనం స్త్రీ. అలాంటి స్త్రీ శక్తి ప్రతిరూపం దుర్గమ్మ. అమ్మవారిని 108 నామాలతో స్మరిస్తాం. నా 108వ చిత్రం భగవంత్ కేసరి ఈ నవరాత్రుల్లో విడుదల కావడం, ఈ చిత్రానికి మూలం స్త్రీశక్తి కావడం, అమ్మవారి వాహనం పులి కావడం, ఈ చిత్రం కూడా బనావో బేటికో షేర్ అనే అంశంతో చేయడం చాలా సంతోషంగా వుంది. ఇలాంటి గొప్ప సందేశాత్మక చిత్రంలో మేమంతా పాలుపంచుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. తెలుగు చలన చిత్ర పరిశ్రమలోనే కాదు భారతీయ చలనచిత్రపరిశ్రమలో శాశ్వతంగా నిలిచిపోయే చిత్రం 'భగవంత్ కేసరి'. ఇలాంటి అద్భుతమైన సినిమా తెలుగువారు తీశారని దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. ఇంతటి ఘన విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నాన్నగారి స్ఫూర్తితో ఏదైనా వైవిధ్యంగా చేయాలనే తపనతో చిత్ర పరిశ్రమలో నా ప్రస్థానం కొనసాగుతోంది.' అని అన్నారు హీరో బాలకృష్ణ. అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, శ్రీలీల నటించిన భగవంత్ కేసరి ఈనెల 19న విడుదలైన విషయం తెలిసిందే. చిత్ర యూనిట్ విజయోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకురాలు నందిని రెడ్డి ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్నారు.

'చిరు 156' ప్రారంభం



చిరంజీవి హీరోగా వశిష్ట తెరకెక్కించనున్న 'చిరు 156' సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం ఓ వీడియో అప్డేట్ ఇచ్చింది. ఈ చిత్రాన్ని మొదట ఓ సెలెబ్రేషన్ సాంగ్ రీ రికార్డింగ్ పనులతో స్టార్ట్ చేశామని, సినిమాలో ప్రస్తుతానికి 6 పాటలు ఉన్నాయని ఈ సినిమాకి సంగీతం అందిస్తున్న ఎంఎం కీరవాణి తెలిపారు. కె రాఘవేంద్రరావు క్లాప్‌తో ఈ చిత్రం ప్రారంభించారు.

ముగిసిన వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు

రామసుబ్బారెడ్డికి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల అవార్డు ప్రదానం



ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో కళల కాణాచి సంస్థ, విజయవాడకు చెందిన వేదగంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ప్రారంభమైన తృతీయ జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన నాటక ప్రదర్శనల్లో ఏడు పద్య నాటికాలు, ఏడు సాంఘిక నాటికలు, మరో ఐదు ప్రత్యేక సాంఘిక నాటికాలను ప్రదర్శించారు. చివరి రోజున ఉక్కు నగరం విశాఖపట్టణం వారి 'ది గిఫ్ట్', గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి 'అమృతహస్తం' సాంఘిక నాటికల ప్రదర్శన జరిగింది. నాటకాల ముగింపు సందర్భంగా ప్రముఖ నాటకరంగ విశ్లేష కులు కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ పౌరాణిక నటులు పొన్నాల రామసుబ్బారెడ్డికి ప్రదానం చేశారు. ఈ కార్య క్రమంలో సినీ హీరో అశోక్ గల్లా, కళల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్య నాటకం 'వసంతరాజీయం', ఉత్తమ సాంఘిక నాటిక 'రాత'

నాటక ప్రదర్శనల్లో విజేతల వివరాలను కళల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్, వేదగంగోత్రి ఫౌండేషన్ అధ్యక్షులు జివిఎన్ఆర్ ఎస్ఎస్-ఎస్ వరప్రసాద్ వెల్లడించారు. పద్య నాటకాల్లో హైదరాబాద్ కళానికేతన్ వారి ప్రదర్శన 'వసంత రాజీయం' ప్రథమ స్థానాన్ని, విశాఖపట్టణం జయ కళానికేతన్ వారి 'శ్రీకాంత కృష్ణమాచార్య' ద్వితీయ స్థానాన్ని, కాకినాడ కుమారరామ భీమేశ్వర నాట్యమండలి వారి 'నర్తనశాల' తృతీయ స్థానాన్ని పొందాయి. సాంఘిక నాటికలో వెలగలేరుకు చెందిన వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి 'రాత' ప్రథమ స్థానాన్ని, కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారి 'స్వప్నం రాల్చిన అమృతం' ద్వితీయ స్థానాన్ని, ఉక్కునగరం విశాఖపట్నం వారి 'గిఫ్ట్' నాటిక తృతీయ స్థానాన్ని సాధించాయి.

అమెరికా వడ్డీ రేట్ల పెంపుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ

ఈజిప్ట్ ఆర్థికవేత్త విమర్శ

కైరో : అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను నిరంతరంగా పెంచడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత దారుణమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈజిప్ట్ ఆర్థికవేత్త ఒకరు వ్యాఖ్యానించారు. మరీ ముఖ్యంగా వర్ధమాన దేశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గతేడాది మార్చి నుండి వరుసగా 11సార్లు ఫెడ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచింది. 5.25శాతం నుండి 5.50శాతం మధ్య ఈ పెంపు వుంది. దీంతో 22ఏళ్ళలో ఎన్నడూ లేనంత అధిక స్థాయికి వడ్డీ రేట్లు వెళ్ళిపోయాయి. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలనే లక్ష్యంతో పెంచుతున్నామని చెబుతున్నప్పటికీ వార్షిక ద్రవ్యోల్బణం రేటు సెప్టెంబరులో 3.7శాతంగా వుంది. ఫెడ్‌బ్యాంక్ పెట్టుకున్న లక్ష్యం 2శాతమే. 'అమెరికా ఇలా వరుసగా వడ్డీరేట్లు పెంచడం వల్ల వర్ధమాన దేశాలు ఇబ్బందుల్లో పడతాయని, మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఈజిప్షియన్ అసోసియేషన్ ఫర్ పొలిటికల్ ఎకానమీకి చెందిన సభ్యుడు వలీద్ గబల్లా వ్యాఖ్యానించారు.

డికాక్ సెంచరీ

- క్లాసెన్ క్లాసిక్ ఇన్నింగ్స్
- మహ్మదుల్లా సెంచరీ వృథా
- బంగ్లాదేశ్‌పై 149పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు



ముంబయి: వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా మరో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. వాంఖడే స్టేడియంలో మంగళ వారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 149పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 382 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో భాగంగా బంగ్లా 46.4ఓవర్లలో 233పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ 158పరుగులకే 8వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో మిడిలార్డర్ బ్యాటర్ మహ్మదుల్లా(111; 111బంతుల్లో 11ఫోర్లు, 4సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కినా ప్రయోజనం లేకపోయింది. కెప్టెన్ షకీబ్(1), ముష్ఫికర్(9), నజ్ము(0) నిరాశపరచడంతో జట్టు ఫలితంపై ప్రభావం చూపింది. దక్షిణాఫ్రికా బౌలర్లు కోర్జేకు మూడు, జెన్సన్, విలియమ్స్, రబడాకు రెండేసి, మహరాజ్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డి కాక్‌కు లభించింది.

అంతకుముందు దక్షిణాఫ్రికా ఓపెనర్, వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ మరోసారి భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. ఈసారి ఏకంగా 174 పరుగులతో కదం తొక్కాడు. ఇందులో 15ఫోర్లు, భారీ 7సిక్సర్లు ఉన్నాయి. హెన్రిచ్ క్లాసెన్ (90; 49బంతుల్లో 2ఫోర్లు, 8సిక్సర్లు క్లాసిక్ ఇన్నింగ్స్,కి తోడు చివర్లో డేవిడ్ మిల్లర్ (34నాటౌట్; 15బంతుల్లో ఫోర్, 4సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో దక్షిణాఫ్రికాజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 382 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (12; 19 బంతుల్లో), వాండర్ డుసెన్(1) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహమూద్‌కు రెండు, షోరిఫుల్, హసన్ మిరాజ్, షకీబ్ అల్ హసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	5	5	0	10	+1.35
2.	దక్షిణాఫ్రికా	5	4	1	8	+2.37
3.	న్యూజిలాండ్	5	5	1	8	+1.48
4.	ఆస్ట్రేలియా	4	2	2	4	-0.19
5.	పాకిస్తాన్	5	2	3	4	-0.40
6.	ఆఫ్ఘనిస్తాన్	5	2	3	4	-0.96
7.	నెదర్లాండ్స్	4	1	3	2	-0.79
8.	శ్రీలంక	4	1	3	2	-1.04
9.	ఇంగ్లండ్	4	1	3	2	-1.24
10.	బంగ్లాదేశ్	5	1	4	2	-1.25

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రెట్

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)నసుమ్(బి)హసన్ 174, హెండ్రిక్స్ (బి)షోరిఫుల్ ఇస్లామ్ 12, డుస్సెన్ (ఎల్‌బి)మెహిదీ హసన్ మిరాజ్ 1, మార్క్రమ్ (సి)లింటన్ దాస్ (బి)షకీబ్ 60, క్లాసెన్ (సి)మహ్మదుల్లా (బి)హసన్ మహ్మద్ 90, మిల్లర్ (నాటౌట్) 34, జెన్సన్ (నాటౌట్) 1, అదనం 10. (50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 382 పరుగులు. **వికెట్ల పతనం:** 1/33, 2/36, 3/167, 4/309, 5/374 **బౌలింగ్:** ముస్తాఫిజుర్ 9-0-76-0, మిరాజ్ 9-0-44-1, షోరిఫుల్ 9-0-76-1, షకీబ్ 9-0-69-1, హసన్ 6-0-67-2, నసుమ్ 5-0-27-0, మహ్మదుల్లా 3-0-20-0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ హసన్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 12, లింటన్ దాస్ (ఎల్‌బి)రబడా 22, నజ్ముల్ హొసైన్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 0, షకీబ్-అల్-హసన్ (సి)క్లాసెన్ (బి)విలియమ్స్ 1, ముష్ఫికర్ రహీమ్ (సి)ఫెల్వ్లుయో (బి)కోర్జే 8, మహ్మదుల్లా (సి)జెన్సన్ (బి)కోర్జే 114, మెహిదీ హసన్ (సి)ఫెల్వ్యూలియో (బి)మహరాజ్ 11, నసుమ్ (సి అండ్ బి)కోర్జే 19, హసన్ మహ్మద్ (సి)కోర్జే (బి)రబడా 15, ముస్తఫిజుర్ (సి)మిల్లర్ (బి)విలియమ్స్ 11, షోరిఫుల్ ఇస్లామ్ (నాటౌట్) 6, అదనం 17. (46.4 ఓవర్లలో) 233 పరుగులకు ఆలౌట్. **వికెట్ల పతనం:** 1/30, 2/30, 3/31, 4/42, 5/58, 6/81, 7/122, 8/159, 9/227, 10/233 **బౌలింగ్:** జెన్సన్ 8-0-39-2, విలియమ్స్ 8.4-1-56-2, కోర్జే 10-0-62-3, రబడా 10-1-42-2, మహరాజ్ 10-0-32-1

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
ఆస్ట్రేలియా × నెదర్లాండ్స్ (వేదిక: ఢిల్లీ; మ.2.00గం॥లకు)

ఆఫ్ఘన్ మరో సంచలనం

పాకిస్తాన్‌పై 8వికెట్ల తేడాతో గెలుపు

చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు మరో సంచలనానికి తెరలేపింది. చెపాక్ స్టేడియంలో సోమవారం పాకిస్తాన్‌పై 8వికెట్ల తేడాతో గెలిచి రెండే సంచలనం నమోదు చేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి కోల్పోయి 282 పరుగులు చేసింది. ఓపెనర్ షఫీక్(58), బాబర్(74) అర్ధసెంచరీలకి తోడు షాదాబ్(40), ఇఫ్తికార్(40) బ్యాటింగ్‌లో రాణించారు. నూర్ అహ్మద్‌కు మూడు, నవీన్-ఉల్-హక్‌కు రెండు, నబీ, అజ్మతుల్లాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ జట్టు 49ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 286పరుగులు చేసి గెలిచింది. హస్మతుల్లా షాహిదీ(48నాటౌట్; 45బంతుల్లో 4ఫోర్లు), రహ్మత్‌షా(77నాటౌట్; 84బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) ఆఫ్ఘన్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్(65; 53బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), ఇబ్రహీం జద్రాన్(87; 113బంతుల్లో 10ఫోర్లు) తొలి వికెట్‌కు 130పరుగులు చేసి గట్టి పునాది వేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇబ్రహీం జద్రాన్‌కు లభించింది. దీనికి ముందు ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఇంగ్లండ్‌జట్టుపై 69పరుగుల తేడాతో నెగ్గి తొలి సంచలనానికి తెరలేపిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68